బయో సెక్యూరిటీయే
కోళ్లకు రక్షణ కవచం
వేల్పూరులో పరిశీలించిన
కేంద్ర అధికారుల బృందం 7



ముదినేపల్లి మండలం పేరూరు వద్ద పోల్‌రాజ్ డ్రెయిన్‌పై కూలిన వంతెన

వంతెన కూలి నాలుగేళ్లు..!

- వైసీపీ హయాంలో పట్టించుకోలేదు..
- ప్రతిపాదనల్లోనే కొత్త వంతెన నిర్మాణం



వంతెన దిమ్మలపై ఏర్పాటు చేసిన ఐరన్ ప్లేటు

ముదినేపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి - కైకలూరు జాతీయ రహదారి నుంచి పుట్లచెరువు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో పేరూరు వద్ద పోల్‌రాజ్ మేజర్ డ్రెయిన్‌పై వంతెన కూలిపోయి నాలుగేళ్ల గడిచినా కొత్త వంతెన నిర్మాణం ప్రతిపాదనల దశ దాటలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నూతన వంతెన నిర్మాణ ప్రతిపాదనలు పంపితే నిధులు లేవంటూ బుట్టదాఖలు చేశారు. 2021లో అప్పటికే శిథిలావస్థకు చేరుకున్న ఈ వంతెనపై లోడు లారీ వెళ్తుండగా శ్లాబు పూర్తిగా కూలిపోగా, పునాదులు కదిలి బీటలు వారాయి. బీటలు వారిన పునాదులపై తాత్కాలికంగా గ్రామ స్థులు, రైతులు ఐరన్ ప్లేటు ఏర్పాటు చేసి కాలినడకన, బైక్‌లు వెళ్లేందుకు సౌకర్యం ఏర్పాటు చేసుకున్నారు. పేరూరు, దాకరం గ్రామస్థులు పొలాలకు వెళ్లేందుకు వంతెన సౌకర్యం లేక ముదినేపల్లి, కల్వపూడి అగ్రహారం మీదుగా సుమారు పది కిలోమీటర్లు చుట్టు తిరిగి రావాల్సి వస్తోంది.

చర్యలు తీసుకుంటున్నాం

పోల్‌రాజ్ మేజర్ డ్రెయిన్‌పై పేరూరు వద్ద కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు తీసు కుంటున్నాం. పాత ప్రతిపాదనల ప్రకారం వంతెన నిర్మాణానికి రూ.3 కోట్లు అవసరం కాగా ఇప్పుడు ఆ వ్యయం రూ.6 కోట్లకు చేరింది. నిధులు మంజూరుకు చర్యలు తీసు కుంటాం.

- అనిల్ కుమార్, ఆర్‌అండ్‌బీ డీఈఈ, కైకలూరు

సైకిల్‌కు సవాల్
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి పక్షాన భారీగా మోహరింపు
- సవాల్‌గా తీసుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు
- కలిసి నడుస్తున్న టీడీపీ, జనసేన.. మిన్నకుండిన బీజేపీ

7

వంట నూనెలు సల..సల..
- భగ్గుమంటున్న ధరలు
- పేద, మధ్య తరగతి ప్రజలు బెంబేలు
- ఇప్పట్లో దిగి రావంటున్న వ్యాపారులు



6



ట్రాప్ కెమెరాలో చిక్కిన గోదావరి నది వద్దకు నీటి కోసం వస్తున్న చిరుత

వన్యప్రాణుల స్వేచ్ఛకు.. విఘాతం!

- పాపికొండల అభయారణ్యంలో గొర్రెల మందల చొరబాటు
- ఆంధ్రజ్యోతి కథనాలతో గతంలో వెనక్కు పంపిన అధికారులు
- మళ్లీ పెరిగిన మందలు.. వన్య ప్రాణుల ప్రాణాలకు కొరవడిన రక్షణ

పోలవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పాపికొండల అభయారణ్యంలో వన్యప్రాణుల సంచారానికి విఘాతం కలుగుతోంది. ఈ ప్రాంతంలో మేత విరివిగా దొరకడంతో గొర్రెలను మేపేందుకు ఇటుగా తరలించడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. దీనిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సి వుంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ప్రాజెక్టు ఎగువన ఉన్న 19 గ్రామాలను అధికారులు దిగువ మైదాన ప్రాంతాలకు తరలించారు. పాపికొండల నేషనల్ పార్కు పరిధిలో నీట మునిగిన భూభాగానికి బదులుగా తరలించిన గ్రామాల భూములను జలవనరుల శాఖ అధికారులు అటవీశాఖకు అప్పగించారు. గోదావరి నది సహజ ప్రవాహాన్ని ప్రాజెక్టు నిర్మాణంలో స్పిల్‌వేలోకి మరలించడంతో ఎగువ ప్రాంతాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పాపికొండల అభయారణ్యంలోని వన్యప్రాణులు ముంపు గ్రామాలలో స్వేచ్ఛగా సంచరించడం ప్రారంభించాయి. వేసవిలో నీటి కోసం గోదావరి నదికి రావడం నీటిని తాగి వెళ్లడం, ముంపు గ్రామాల మైదాన ప్రాంతాల్లో గడ్డి ఆహారం కోసం వన్యప్రాణులు స్వేచ్ఛగా సంచరిస్తూ తమ సంతతిని పెంచుకుంటున్నాయి.

ఆంధ్రజ్యోతి కథనాలతో నియంత్రణ

ఈ తరుణంలో కొందరు గొర్రెల మందల యజమానులు తమ ప్రాంతాల నుంచి గొర్రెలను ప్రత్యేక వాహనాలలో పాపికొండల అభయారణ్యంలో మేపడానికి తీసుకువస్తున్నారు. పోలవరం మండలంలో వింజరం, సున్నాలగండి, మెత్తప్పకోట, ఉడతపల్లి గ్రామాల మీదుగా తెల్లవరం, గాజులగొంది మాదాపురం కొండ్రుకోట గ్రామాలకు తరలిస్తున్నారు. అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా గొందూరు వైపు మరి కొందరు వాహనాలలో గొర్రెలను తరలించి అక్కడి నుంచి బోట్లలో తీసుకువస్తున్నారు. పోలవరం నుంచి పాత తోటగొంది, తెల్లవరం వైపు గొర్రెలను తరలిస్తున్నారు. ఆయా ప్రాంతాలలో గొర్రెలకు మేత పుష్కలంగా దొరుకుతుండడంతో కాపరులు దీనిని అడ్డాగా వాడుకుంటున్నారు. ఈ నెపంతో అడవి పందులు, కోళ్ల ఇతర వన్య మృగాలను వేటాడి మాంసాల రవాణా, అమ్ముకోవడం, తినడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. ఈ విషయంపై గతంలో ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనాలు ప్రచురించడంతో అధికారులు స్పందించి వాటిని అడవి నుంచి వెళ్లగొట్టారు.

అరణ్యంలోకి మళ్లీ గొర్రెల మందలు

గొర్రెల కాపరులు తమ మందలను ఇటీవల మళ్లీ అభయారణ్యంలోకి తరలిస్తున్నారు. అధిక సంఖ్యలో వెళ్లడంతో వన్యప్రాణులు నీటి కోసం గోదావరి నదికి వెళ్లడానికి భయపడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో 902 హిల్ వైపు, ప్రాజెక్టులో పాత లేబర్ క్యాంపు వైపు మట్టి డంపింగ్ జరుగుతున్న ప్రాంతాలకు తరలి వస్తున్నాయి. మూలలంక ప్రాజెక్టు మట్టి డంపింగ్ ప్రాంతాలలో తరచూ వన్యప్రాణులు తారసపడుతున్నాయి. కొన్ని రోజుల క్రితం 902 హిల్ ప్రాంతంలో మంచినీటి ట్యాంకు వద్ద చిరుత నీటి కోసం రావడంతో డ్రైవర్లు భయపడి లారీలపైకి ఎక్కారు. గత ఏడాది వేసవిలోను చిరుత 902 హిల్ ప్రాంతంలో సంచరించింది. గత ఏడాది పాపికొండల అభయారణ్యం నుంచి పెద్దపులి మైదాన ప్రాంతాలకు వచ్చి పోలవరం మండలం నుంచి ద్వారకా తిరుమల వరకూ సంచరించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. పశువులపై దాడులకు పాల్పడింది. గొర్రెల మందల చొరబాటులో కొందరు అటవీ శాఖ సిబ్బంది, ప్రాజెక్టు భద్రతా సిబ్బంది కాపరులు ఇస్తున్న మామూళ్లకు కక్కుర్తిపడి గొర్రెల మందలను పాపికొండల అభయారణ్యంలోకి అనుమతిస్తున్నారని ప్రచారం జరుగుతోంది.



పాపికొండల అభయారణ్యానికి తరలిస్తున్న గొర్రెల మందలు

మేపుకోవాలంటే డబ్బు కట్టాలి

అభయారణ్యంలోకి కొత్తగా గొర్రెల మందలతో వెళ్లిన ఓ కాపరిని అప్పటికే అక్కడ ఉన్న గొర్రెల కాపరులు అడ్డుకున్నారు. అటవీ శాఖ సిబ్బందికి సొమ్ములు కట్టి ఇక్కడ గొర్రెలు మేపుకుంటున్నామని చెప్పారు. నువ్వు మేపుకోవాలంటే.. తమకు సొమ్ములు చెల్లించాలని అతనిని బెదిరించి భయపెట్టి వెళ్లగొట్టారు. దీనిపై అటవీశాఖ వైల్డ్‌లైఫ్ అధికారి గోపిని వివరణ కోరగా కొన్ని రోజుల క్రితం గొర్రెల మందలను దిగువకు తరలించమని సిబ్బందికి సూచించినట్లు తెలిపారు.



పంచాయతీ తిమింగలంపై వేటు

రూ.5 కోట్ల దుర్వినియోగంలో కార్యదర్శి సస్పెండ్

- చినఅమిరం, రాయలంలో ఆస్తి పన్ను బొక్కేసిన కిశోర్ రాజు
- సహకరించిన ప్రత్యేక అధికారులపైనా దృష్టి
- స్పెషల్ ఆడిట్‌కు ప్రభుత్వ ఆదేశం

(భీమవరం-ఆంధ్రజ్యోతి): పంచాయతీ నిధుల దుర్వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. రాష్ట్ర చరిత్రలోనే ఏకంగా రూ.ఐదు కోట్లు పక్కదారి పట్టించిన బాధ్యులపై చర్యలు తీసుకుంటోంది. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం రూరల్ మండలంలో చినఅమిరం, రాయలం పంచాయతీలకు కార్యదర్శిగా వ్యవహరించిన కిశోర్ రాజుపై సస్పెన్షన్ వేటు వేసింది. వైసీపీ హయాంలో ఆయన రెండు పంచాయతీలకూ కార్యదర్శిగా వ్యవహరించారు. అధికార పార్టీని అడ్డు పెట్టుకుని ఆస్తిపన్ను సొంత బ్యాంకు ఖాతాలోకి మళ్లించి సొంతానికి వినియో గించుకున్నారు. తన హయాంలో ఇష్టా రాజ్యంగా అనుమతులు ఇచ్చేసి, పెద్ద మొత్తంలో అవినీతికి పాల్పడ్డారు. ప్రజలు చెల్లించే ఆస్తిపన్ను ఏకంగా రూ. ఐదు కోట్లు దారిమళ్లించారు. ఇంతలా అవినీతికి పాల్పడిన కార్యదర్శిపై గత వైసీపీ ప్రభుత్వం గుర్తించలేకపోయింది. పైగా నాటి ప్రజా ప్రతినిధులు సంపూర్ణ సహకారాలు అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అతడి అవినీతి భాగోతం బయటపడింది. లెక్కలు తీస్తే ఆస్తి పన్నునే పక్కదారి పట్టించిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. కార్యదర్శి స్థాయిలో ఇంతటి అవినీతి రాష్ట్ర చరిత్రలోనే లేదు. దీనిపై జిల్లా కలెక్టర్ కఠిన చర్యలకు ఆదేశించారు. క్రిమినల్ కేసు నమోదు చేసేలా ఆదేశాలు జారీచేశారు. హైకోర్టునుంచి స్టే తెచ్చుకోవడంతో తాత్కాలికంగా క్రిమినల్ కేసునుంచి అతను ఊరట పొందారు. జిల్లా స్థాయిలో సస్పెండ్ వేటు వేస్తే న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తారన్న ఉద్దేశంతో ప్రభుత్వానికి నివేదిక పంపారు. క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి రెండు పంచాయతీల్లోనూ రూ. ఐదు కోట్లు గోల్ మాల్ అయ్యిందని గుర్తించారు. విచారణ నివేదికను పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్‌కు పంపా రు. కమిషనర్ ఆదేశాలతో సస్పెండ్ చేశారు.

స్పెషల్ ఆడిట్..

నిధులు గోల్‌మాల్‌పై ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. బాధ్యులందరి పైనా చర్యలకు ప్రణాళిక రచించింది. మరోసారి స్పెషల్ ఆడిట్ నిర్వహించాలని పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. ఆ దిశగా జిల్లాలో స్పెషల్ ఆడిట్‌కు చర్యలు తీసుకు న్నారు. చినఅమిరం, రాయలం పంచాయతీల్లో ఆస్తిపన్ను పక్కదారికి సంబంధించి జిల్లా ఆడిట్ అధికారి ఆధ్వర్యంలో ఆడిట్ నిర్వహిస్తున్నారు. తుది నివేదిక అంది న తర్వాత ఇతరుల పైనా చర్యలు తీసుకోనున్నారు.

రికవరీకి చర్యలు..

స్పెషల్ ఆడిట్ నివేదిక అందిన తర్వాత రికవరీకి జిల్లా అధికారులు సిద్ధమవుతున్నారు. తుది నివేదిక కోసం వేచి చూస్తున్నారు. రాయలం పంచాయతీలో మరో ఉద్యోగి కూడా రూ. 15 లక్షలు కాజేసినట్టు గుర్తించారు. అతడిని కూడా సస్పెండ్ చేశారు. మొత్తం సొమ్మును రికవరీ చేయాలన్న తలంపుతో అధికారులున్నారు. కిశోర్ రాజు బదిలీపై ఇతర జిల్లాకు వెళ్లినప్పుడే పక్కదారి పట్టిన సొమ్మును జమ చేయాలని సహచర ఉద్యోగులు సూచించారు. దీనిని కూడా కార్యదర్శి పెడచెవిన పెట్టారు. అధికార పార్టీ అండదండలున్నాయన్న ఉద్దేశంతో వైసీపీ ప్రభుత్వంలో ఇష్టారీతిన పాలన సాగించారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు నాన్ లేఅవుట్‌లు వేసుకునేలా పూర్తి సహకారం అందించారు. రెండు పంచాయతీలను అప్పుల్లోకి నెట్టేశారు. నిధులు లేకుండా చేశారు.

ప్రత్యేకాధికారుల పాత్ర ఎంత?



చినఅమిరం, రాయలం పంచాయతీలకు పాలక వర్గాలు లేవు. భీమవరం మున్సిపాలిటీలో విలీనం చేయడానికి గత ప్రభుత్వం చర్యలు తీసుకుని విలీనం చేసింది. రెండు గ్రామాలకు చెందిన వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో విలీనం ఆగి పోయింది. కానీ పంచాయతీ ఎన్నికలు జరగలేదు. పాలకవర్గాలు లేవు. ప్రత్యేక అధికారులతోనే పాలన సాగింది. ప్రజలు చెల్లించిన ఆస్తి పన్ను, జమా, ఖర్చులు, ఏటా బడ్జెట్ ఆమోదం ప్రత్యేక అధికారి కనుసన్నల్లోనే ఉంటాయి. వారి పర్యవేక్షణ నిరం తరం ఉంటుంది. అయినా కార్యదర్శి కిశోర్ రాజు రూ. ఐదు కోట్లు ఎలా సొంత ఖాతాలో జమ చేసుకున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రత్యేక అధికారులు ఆశీస్సులతోనే నిధులు గోల్‌మాల్ జరిగాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్పెషల్ ఆడిట్ నివేదిక అందిన తర్వాత రెండు పంచాయ తీలకు ప్రత్యేక అధికారులుగా వ్యవహరించిన వారిపైనా చర్యలు తీసుకోనున్నారు. నిధులు గోల్‌మాల్ వ్యవహారంలో వారిని కూడా బాధ్యులను చేయనున్నారు. ఆ దిశగా కసరత్తు జరుగుతోంది.



వీసీలో సమీక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ తదితరులు

గ్రూప్-2 పరీక్షకు పావు గంట ముందుగానే 'గేట్‌క్లోజ్'

ఆరు కేంద్రాల్లో 4,415 మంది అభ్యర్థులు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్ష ఆదివారం జరగనున్న నేపథ్యంలో నిర్వహణ ఏర్పాట్లతో పాటు, కొద్దిరోజుల్లో ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు సన్నాహాలపై గురువారం కలెక్టర్ వెట్రిసెల్వి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ ధాత్రిరెడ్డి, ఎస్పీ శివకిశోర్, ఏఎస్పీ సూర్యచంద్రరావు, డీఆర్వో విశ్వేశ్వరరావు, లైజన్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ 'ఈనెల 23న ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు పేపర్-1 పరీక్ష, మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్ష జరుగుతాయి. గంటన్నర ముందు గానే అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. పరీక్ష ప్రారంభ సమయానికి 15 నిమిషాల ముందుగానే గేట్లు మూసివేస్తారు. జిల్లాలో గ్రూప్-2 పరీక్ష ఆరు కేంద్రాల్లో జరుగుతుండగా 4,415 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షార్థుల సౌకర్యార్థం శుక్రవారం నుంచి కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేస్తున్నాం. పరీక్ష కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలను సమన్వయ అధికారులను కల్పించాలి. పరీక్షార్థులకు వీలుగా ఆర్టీసీ బస్సుల రాకపోకల సమయాలను రీ షెడ్యూల్ చేయాల'ని సూచించారు.

ఏప్రిల్ 30న ఏపీ పాలిసెట్

వచ్చే విద్యాసంవత్సరానికి పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు ఏపీ పాలీసెట్-2025ని ఏప్రిల్ 30న నిర్వహించనున్నారు. ఈ పరీక్ష ఉదయం 11 గంటల నుంచి ఒంటిగంట వరకు జరుగుతుంది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి తాడేపల్లిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్, తణుకు ఎస్ఎంవీఎం పాలిటెక్నిక్, భీమవరం బి.సీత పాలిటెక్నిక్, నరసాపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల, ఏలూరు సీఆర్ఆర్ పాలిటెక్నిక్, నూజివీడు పాలిటెక్నిక్‌లను కో-ఆర్డినేటింగ్ సెంటర్లుగా ఎంపిక చేశారు. వీటికి కో-ఆర్డినేటర్లుగా జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల ప్రిన్సిపాళ్లను నియమించారు. ఉమ్మడి జిల్లాలో తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం, కె.ఆర్.పురంలో ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు ఉండగా, ఏలూరు, తణుకు, భీమవరం, నూజివీడులలో ప్రైవేటు పాలిటెక్నిక్‌లున్నాయి. వీటన్నింటిలో 6నుంచి 7వేల వరకు సీట్లు అందుబాటులో ఉన్నాయి. దరఖాస్తుల స్వీకరణ ఈనెల 22 నుంచి ప్రారంభమవుతుంది.

పీఎంపీలు, ఆర్ఎంపీలు పరిధి దాటి వైద్యం చేయొద్దు : డీఐవో

గ్రామాల్లో ప్రథమ చికిత్సలందించే ఆర్ఎంపీలు, పీఎంపీలు తమ పరిధి దాటి వైద్యం చేయొద్దని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేశ్వరరావు హెచ్చరించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో గురువారం జిల్లాలోని ఆర్ఎంపీలు, పీఎంపీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ వైద్యంలో ఇంజెక్షన్లు చేయడం, శస్త్రచికిత్సలు చేయడం, ఔషధాలను ఇవ్వడం, గర్భవిచ్ఛిత్తి (అబార్షన్లు)కి మందులు ఇవ్వడం లేదా అబార్షన్లు చేయడం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరాదన్నారు. ప్రతీ ప్రథమ చికిత్స కేంద్రం రిజిస్టర్ కావాలని, రిజిస్ట్రేషన్ నెంబరును బోర్డులో ప్రదర్శిం చాలని ఆదేశించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు మాట్లాడుతూ పీఎంపీలు, ఆర్ఎంపీలు డెంగీ వ్యాధి నిర్ధారణ చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయొద్దని, రోగులను ప్రభుత్వాస్ప త్రులకు పంపాలన్నారు. పీఎంపీల అసోసియేషన్ అధ్యక్షుడు శివరామకృష్ణ పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న జాయింట్ సెక్రటరీ మహ్మద్ ఉబేదుల్లా

గురుకుల పాఠశాలలో జాయింట్ సెక్రటరీ విచారణ

ముసునూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ముసునూరు గురుకుల పాఠశాలలో బాలికలను వేధించడం, నాణ్యత లేని భోజనం, ఉపాధ్యాయుల మధ్య గ్రూపులు తదితర వాటిపై ఎస్ఎంసీ సభ్యులు ఇటీవల ఉన్నతాధికారులకు చేసిన ఫిర్యాదుపై గురువారం రాష్ట్ర గురుకుల పాఠశాలల జాయింట్ సెక్రటరీ మహ్మద్ ఉబేదుల్లా విచారణ చేశారు. ఎస్ఎంసీ సభ్యుల నుంచి ఆయన వివరాలు సేకరించారు. పాఠశాలలో సమస్యలపై మాట్లాడితే, తమ పిల్లలను వేధింపులకు గురి చేస్తున్నారని, నాణ్యత లేని భోజనం పెడుతున్నారని, ఉపాధ్యాయులు రెండు గ్రూపులుగా విడిపోయి విద్యాబోధన సరిగ్గా చేయడం లేదని కమిటీ సభ్యులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. పాఠశాల ప్రిన్సిపాల్, సహచర ఉపాధ్యాయులను విడిగా విచారణ చేశారు. బాలికల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల, మెనూ రికార్డులను పరిశీలించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. విజయవాడ గురుకుల పాఠశాల ప్రిన్సి పాల్ శివకుమారి, ఎంఈవో సుబ్బారావు, ప్రిన్సిపాల్ కె.ప్రవీణ పాల్గొన్నారు.

పంచాయతీలకు.. ఆర్థిక పరిపుష్టి

- 2024-25 సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘ నిధులు విడుదల
- ఏలూరు జిల్లాలోని 531 పంచాయతీలకు రూ.33.25 కోట్లు

మండలం పేరు	పంచాయతీల సంఖ్య	టైడ్ నిధులు (రూపాయల్లో)	బేసిక్ నిధులు (రూపాయల్లో)
ఆగిరిపల్లి	22	7146470	4764319
భీమడోలు	13	8275155	5516770
బుట్టాయిగూడెం	21	7643016	5095345
చాట్రాయి	13	4936195	3290797
చింతలపూడి	19	8665808	5777206
ద్వారకాతిరుమల	28	8792481	5861657
దెందులూరు	17	8464118	5642747
ఏలూరు	15	4756100	3170732
జంగారెడ్డిగూడెం	20	7802982	5201985
జీలుగుమిల్లి	12	4462517	2975009
కామవరపుకోట	15	7358731	4905820
కైకలూరు	26	9662597	6441733
కలిదిండి	23	8878276	5918849
కొయ్యలగూడెం	16	8815116	5876743
కుక్కునూరు	15	5378226	3585483
లింగపాలెం	22	7561531	5041018
మండవల్లి	28	5763963	3842641
ముదినేపల్లి	32	8126084	5417391
ముసునూరు	15	7140463	4760307
నిడమర్రు	16	5967997	3978664
నూజివీడు	27	8808989	5872661
పెదపాడు	23	8553761	5702505
పెదవేగి	30	10935805	7290534
పోలవరం	13	5175884	3450589
టి నరసాపురం	15	7407246	4938163
ఉంగుటూరు	27	10132649	6755097
వేలేరుపాడు	8	2890067	1926711
మొత్తం	531	1995022271	33001476

టైడ్+బేసిక్ కలిపి 33 కోట్ల 25 లక్షల 3 వేల 703 రూపాయలు



ఏలూరు సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు శుభవార్త. 2024-25 సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘ నిధులు విడుదల య్యాయి. ఏలూరు జిల్లాలోని 531 గ్రామ పంచాయతీలకు రూ.33.25 కోట్లు జమయ్యాయి. టైడ్, బేసిక్ పద్ధతులలో జనాభా ఆధారంగా ఈ నిధులను పంచాయతీలకు కేటాయించింది. గ్రామానికి కేటాయించిన నిధుల్లో 60 శాతం నిధులను టైడ్ నిధులుగా పేర్కొంటారు. మరల ఈ టైడ్ నిధుల్లో 50 శాతం మంచినీటి అవసరాలకు, 50 శాతం శానిటేషన్‌కు ఖర్చు చేయాల్సి ఉంది. గ్రామానికి కేటాయించిన నిధుల్లో 40 శాతం నిధులను బేసిక్ నిధులుగా పేర్కొంటారు. ఈ నిధులను గ్రామంలోని అన్ని అవసరాలకు వినియోగించుకోవచ్చు. ఇప్పటి వరకు నిలిచిన మంచినీటి వనరుల మరమ్మతులు, విద్యుత్ బిల్లులు చెల్లింపులతోపాటు అత్యవసర పనులకు వీటిని కేటాయించవచ్చు. గత ప్రభుత్వ హయాంలో ఈ ఆర్థిక సంఘ నిధులను పక్కదారి పట్టించింది. పంచాయతీలకు నేరుగా కేటాయించాలని సర్పంచ్‌ల సంఘం పలుసార్లు అప్పటి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. ఫలితంగా నిధులు లేక పంచాయతీలు అల్లాడిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక సంఘ నిధులను పంచాయతీలకు కేటాయిస్తామని హామీ ఇచ్చింది. ఆ మేరకు విడుదల చేసింది.

పనిచేసేవారే వర్సిటీలో ఉంటారు

బాధ్యతలు స్వీకరించిన నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

కళలకు ప్రోత్సాహం.. పరిశోధనలకు ప్రాధాన్యం

నైపుణ్యాభివృద్ధిని విద్యార్థులకు చేరువ చేస్తా

ఆంధ్రజ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడి



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఆమె గిరిజన కుటుంబంలో పుట్టారు. కష్టపడి చదువుకున్నారు. 23 భాషలు మాట్లాడతారు. ఇంతింతై అన్నట్టు ఎన్నో పదవులను చేపట్టి నన్నయ వర్సిటీ ఉపకులపతిగా ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ నియమితులయ్యారు. ఈ ప్రయాణంలో ఆమె పడిన కష్టాలు.. వర్శిటీని ఉన్నత స్థాయికి తీసుకు వెళ్లడంలో ఏ విధమైన ప్రణాళికతో ముందుకు వెళతారు ? అనే అంశాలపై గురువారం బాధ్యతలు స్వీకరించిన ఆమెను ఆంధ్రజ్యోతి పలకరించగా ఇలా చెప్పుకొచ్చారు.

రాజమహేంద్రవరం కోడలినే..

నన్నయ వర్సిటీకి వీసీగా రావడం ఆనందంగా ఉంది. నేను రాజమండ్రి కోడలినే. మా మామగారు.. మా అల్లుడు ఈ ప్రాంతంవారే. మంచితనం, ప్రేమ, ఆదరణ, మర్యాదలకు ఈ ప్రాంతం పెద్దపీట వేస్తుందని అందరికీ తెలిసిన సత్యమే. నాకు కళలంటే చాలా ఇష్టం.. సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో నాకున్న అవకాశం మేరకు కళలు ప్రోత్సహించేందుకు కృషి చేస్తా.

ఇక్కడా పరిశోధనలు చేస్తా..

విశ్వ విద్యాలయంలోని వనరులను పరిశీలించి, ఇక్కడి పరిస్థితులను ఆకళింపు చేసుకున్నాక పరిశోధనలను ప్రోత్సహించే విషయమై దృష్టి సారిస్తా. పరిశోధనలు చేసేందుకు ఇక్కడ గల అవకాశాలు, సంభావ్యత, వాటి వల్ల ఈ ప్రాంతానికి ఎంత మేరకు మేలు జరుగుతుంది మొదలైన విషయాలను పరిశీలించి పరిశోధనల వైపు దృష్టిసారిస్తా.

ఒక గిరిజన మహిళకు తొలి అవకాశం..

రాష్ట్రం ఏర్పడిన తర్వాత గిరిజన మహిళను విశ్వ విద్యాలయానికి ఉపకులపతిగా తొలిసారిగా కూటమి ప్రభుత్వం నియమించింది. ప్రతిభ ఆధారంగా వీసీలను నియమించామని తెలుపుతూ తన గురించి సీఎం చంద్రబాబునాయుడు ప్రస్తావించడం నాకెంతో సంతోషం కలిగించింది. నాకు ఇచ్చిన ఈ అవకాశంతో మూడేళ్లపాటు వీసీగా మరింత బాధ్యతగా పనిచేస్తా.

గిరిజన బిడ్డగా కష్టం విలువ తెలుసు

గుంటూరు జిల్లా స్టువర్టుపురం గిరిజన ప్రాంతం నుంచి వచ్చా. చదువుకోవడానికే ఎన్నోకష్టాలు పడ్డా. అవన్నీ ఎదుర్కొని నేడు వీసీగా ఎదిగా. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో కష్టాలను అధిరోహించి ఉన్నతస్థానాలకు చేరుకోవాలి. గిరిజన బిడ్డగా కష్టం విలువ తెలిసిన నాకు తోటిమనిషికి సాయం చేయడానికి ముందుంటా. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా విధానాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు విద్యార్థులకు చేరువ చేస్తా.

19 గిరిజన భాషలకు లిపి రూపొందించా..

నేను 23 భాషలు మాట్లాడతా. ఆదివాసీల కోసం 19 గిరిజన భాషలకు లిపి రూపొందించా. ఆ సందర్భంలో ఎన్నో అనుభవాలు ఎదురయ్యాయి. నీ కాళ్లల్లో ఎన్ని ముళ్ల గుచ్చుకున్నాయో అంటూ దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం నన్ను ఉద్దేశించి ఒక సందర్భంలో అనడం మర్చిపోలేను.

పనిచేసేవారు మాత్రమే ఉంటారు..

నా సిబ్బందే నా కుటుంబం. నేను పనిచేస్తాను.. సిబ్బంది అందరితో పనిచేయిస్తా. పనిచేసే వారు మాత్రమే విశ్వవిద్యాలయంలో ఉంటారు. పనిదొంగలను ఉంచుకునే అవకాశమే లేదు. పనిచేసే వారికి తొలి ప్రాధాన్యం ఉంటుంది. వర్సిటీ గురించి అంతా తెలుసుకునే వచ్చా. నాకేం తెలియదని అనుకోవద్దు.

వీసీగా ప్రసన్నశ్రీ బాధ్యతల స్వీకరణ

ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అందరి సహకారంతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఉపకులపతి ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో వీసీగా గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. నన్నయ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, ప్రార్థనల మధ్య బాధ్యతలు స్వీకరించారు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులతోపాటు నన్నయ కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌ల అధ్యాపకులు, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని నన్నయ అనుబంధ కళాశాలల నిర్వాహకులు వీసీకి శుభాకాంక్షలు తెలిపారు.



ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్‌తో కుర్చీలో కూర్చున్న కలాం

ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్‌లో స్వర్ణాంధ్ర ముందడుగు

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్‌తో స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల ముందడుగు వేసింది. గురువారం భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంను ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ ద్వారా పునరుద్ధరించి సాంకేతిక పరిజ్ఞానంలో నైపుణ్యతను ప్రదర్శించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ ద్వారా ప్రత్యేకమైన మాడ్యూల్ సాయంతో ఆయన ప్రసంగ శైలిని, వాక్య నిర్మాణాన్ని అంతర్‌దృష్టిని పునః సృష్టించారు. కళాశాల ఛైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ డాక్టర్ కలాం కలలను సాకారం చేసే విధంగా తమ కళాశాల మరో అడుగువేసినందుకు గర్వంగా ఉందన్నారు. కళాశాల డైరక్టర్ అడ్డాల శ్రీహరి ప్రిన్సిపాల్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలలో నేటి నుంచి రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలు

గోపాలపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం మండలం చిట్యాల జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి 42వ టెన్నికాయిట్ పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నట్లు పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనరసింహశాస్త్రీ తెలిపారు. గురువారం ఆయన జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విలేఖర్లతో మాట్లాడుతూ పోటీలకు ముఖ్య అతిథులుగా డీఈవో వాసుదేవరావు, డీవైఈవో రామన్‌దొర పాల్గొంటారని అన్నారు. పోటీలకు 14 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారన్నారు. జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలు, పల్నాడు, ప్రకాశం, బాపట్ల, కర్నూలు, అనంతపురం, కడప, గుంటూరు, ఏలూరు జిల్లాల మహిళా, పురుషుల జట్లు పాల్గొంటాయన్నారు. అవసరమైన వసతులను దాతల సహకారంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోటీలు శనివారం సాయంత్రంతో ముగుస్తాయన్నారు. టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యదర్శి ఆచంట వెంకటేశ్వరరావు, ప్రత్యేక పర్యవేక్షకులు రవీంద్ర, లక్ష్మణరావు, పీఈటీ గద్దే చంద్రశేఖర్, సీఆర్‌పీ కొయ్యనాగరాజులు ఉన్నారు.

వంట నూనెలు సల..సల..



వంటనూనెల ధరలు వేడెక్కుతున్నాయి. ఒకపక్క ఎండల వేడి మరోపక్క నూనె ధరలు మంట పుట్టిస్తున్నాయి. దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతు న్నారు.ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుంటే నూనె ధరల పెరుగుదల వినియోగదారుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. సుమారు సంవత్సరం క్రితం పెరిగిన ధరలు ఇప్పటికి దిగి రాలేదు. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



భగ్గుమంటున్న ధరలు

బెంబేలెత్తున్న పేద, మధ్య తరగతి ప్రజలు

ఇప్పట్లో దిగిరావంటున్న వ్యాపారులు

నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు

పెంటపాడు /ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : నెలరోజుల వ్యవధిలో లీటర్ ఆయిల్ ధరలు రూ.10 నుంచి రూ. 15 వరకు పెరిగాయి. నెలరోజుల క్రితం 15 కేజీల సన్‌ఫ్లవర్ డబ్బా 2150 ఉంటే ఇప్పుడు రూ.2400కు ఎగబాకింది. దీంతో ఒక కేజీ 140 రూపాయల నుంచి 160కి చేరుకుంది. పామాయిల్ కూడా దాదాపు అదే స్థాయిలో ఒక రూ.50కి అటు ఇటుగా ఉంది. వేరుశనగ నెలరోజుల ముందు 2300 ఉంటే ఇప్పుడు 2500కి చేరుకుని కేజీ రూ.165పైకి ఎగబాకింది. వాస్తవానికి సంవత్సరం క్రితం ఉండే పామాయిల్ 900 గ్రాముల నూనె ప్యాకెట్ రూ.125 ఉండేది. ప్రస్తుతం అది రూ.133లకు ఎగబాగికింది. ఫ్రీడం 900 గ్రాముల ధర గతంలో రూ.120 ఉండేది. ప్రస్తుతం అది రూ.150 లకు చేరుకుంది. సంవత్సరం క్రితం ఫ్రీడం సన్‌ఫ్లవర్ హోల్‌సేల్ 15 లీటర్ల డబ్బా రూ.1600 నుంచి రూ 1700 ఉండేది. ఇప్పుడది రూ.2300 లకు చేరింది. పామాయిల్ డబ్బా గతంలో రూ.1350 ఉండగా ప్రస్తుత మార్కెట్‌లో రూ.1900 నుంచి రూ.2 వేల వరకూ ఎగబాకింది. గత వైసీపీ ప్రభుత్వంలో నూనె ధరలు ఆకాశాన్ని తాటాయి. సంవత్సర కాలం నుంచి ప్రజలు పెరిగిన నూనె ధరల కారణంగా ఇబ్బందులు పడుతూనే వస్తున్నారు. హోల్‌సేల్ మార్కెట్ నుంచి నూనె కొనుగోలు చేసినప్పటికీ లేబర్ ఖర్చు, రవాణా ఖర్చులను కలుపుకుని తాము రెండు మూడు రూపాయలు అదనంగా వేసుసుకుని అమ్మ కాలు సాగిస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. అయితే గ్రామాల్లోకి వచ్చేసరికి ఈ ధరలు మరింత పెరిగిపోతున్నాయి. ప్రతీ లీటర్ నూనెపై రూ.10 అదనంగా వెచ్చించుకుని అమ్మకాలు సాగిస్తున్నారు .

• సామాన్యుడు బలైపోతున్నాడు



వంటనూనెల ధరల పెరుగుదల వల్ల సామాన్యులకే దెబ్బ. వ్యాపారస్తులకు లాభం, నష్టం ఉండదు. రైతులకు మద్దతు ధర పెంచటం వల్ల ఆయిల్ రేట్లు పెరుగుతున్నాయి. డాలర్ విలువ పెరగటం కూడా ఒక కారణం. కేంద్ర ప్రభుత్వం విధించిన సుంకాలను తగ్గించుకుంటే వినియోగదారుడికి మేలు జరుగుతుంది.

- నేరేళ్ళ రాజేంద్ర,హోల్‌సేల్ నూనెల వ్యాపారి

• ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి



వంటనూనె ధరలు పెరగడం వల్ల అన్ని రకాల ఆహారపదార్థాల ధరలు పెరుగుతాయి. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలతో పాటు అన్ని రకాల ధరలు పెరిగాయి. రెండోసారి నూనె ధరలు పెరగడం వలన సామాన్యులకు, మధ్యతరగతి ప్రజలకు చాలా ఇబ్బందికరంగా ఉంది. ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

- గొల్లపల్లి మురళీ,వినియోగదారుడు,ఏలూరు

వ్యాపారులు డీలా

టిఫెన్ సెంటర్లు, బజ్జీల బండ్లపై వ్యాపారాలు సాగించేవారికి ఈ ధరలు ఇబ్బందిగా మారాయి. దీంతో వ్యాపారాలు ఎలా సాగించాలో తెలియక తికమక పడిపోతున్నారు. టిఫెన్ సెంటర్‌లో నాలుగు బజ్జీలు రూ.20 లకు విక్రయాలు సాగించే వ్యాపారులు పెరిగిన నూనె ధరలతో చేసేది లేక బజ్జీల సైజ్ తగ్గించి వ్యాపారం సాగిస్తున్నారు. స్వీట్ షాపులది కూడా ఇదే పరిస్థితి. గతంతో షాపును బట్టి కేజీ రూ.150 నుంచి 200 వరకూ సాగించే వ్యాపారులు ప్రస్తుతం ఆ ధరలను పెంచి రూ.200 నుంచి రూ.250 వరకూ విక్రయాలు సాగిస్తున్నారు. ప్రతీది నూనెతోనే అవసరం. ధరలు నియంత్రణ కాకపోతే తమకు జీవనోపాధి ఉండదని కొంత మంది వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూనె ధరలు ఇప్పటిలో తగ్గే పరిస్థితి లేదని పలువురు వ్యాపారులు చెబుతున్నారు.

కారణాలెన్నో..

ఉక్రెయిన్, రష్యాల నుంచి సన్‌ఫ్లవర్ ఆయిల్, ఇండోనేషియా, అర్జెంటీనా, మలేషియా, సింగపూర్ నుంచి పామాయిల్ దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నది. దిగుమతులు చేసుకున్న తరువాత డాలర్లలో డబ్బు చెల్లించాల్సి రావడంతో నూనె ధరలు పెరుగుతున్నాయి.ఆరునెలల క్రితం కేంద్రం సుంకం పెంచడం, ఇప్పుడు రూపాయి మారకం విలువ తగ్గిపోవడంతో మరలా వంటనూనె ధరలకు రెక్కలొచ్చాయి. అంతర్జాతీయంగా పరిణామాలు వేగంగా మార్పు చెందటమే వంటధరల మార్పుకు కారణం. దేశంలో వంటనూనెలు దాదాపు 60 శాతం పైగానే ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నది. దాని వల్ల కూడా ధరలు పెరుగుతున్నాయి.

• ఖర్చులు పెరిగాయి.. ఆదాయం తగ్గింది



నాకు కర్రీ పాయింట్ ఉంది. క్యాంటీన్లకు కూడా ఆర్డర్లపై కర్రీస్ సప్లై చేస్తుంటాను. సంవత్సరం క్రితం ఉండే నూనె ధరలకు ఇప్పటికి ఏమాత్రం పొత్తు లేదు. ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. చేసేది లేక కస్టమర్లకు కొంచెం ధర పెంచి చెప్పాల్సి వస్తుంది. ఖర్చులు పెరిగి పోయాయి. ఆదాయం తగ్గిపోయింది. నూనె ధరలు తగ్గేలా చూడాలి

- ఒడిమిని సత్యనారాయణ, కర్రి పాయింట్ వ్యాపారి, పెంటపాడు

• నూనె ధరలు అందుబాటులోకి తేవాలి



ఇంట్లో ఏం చేసుకుని తినాలన్నా నూనె తోనే అవసరం ఉంటుంది. ప్రస్తుతం నూనె ధరలు చూస్తే భయమేస్తుంది. చాలా దారుణంగా పెరిగిపోయాయి. ఇలా అయితే పేద, మధ్యతరగతి ప్రజలు చాలా ఇబ్బంది పడతారు. ఇలా అయితే ఏం కొనలేం తినలేం..ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి నూనె ధరలు అందరికి అందుబాటులోకి వచ్చేలా చేయాలి.

-కర్రి పభావతి, గృహిణి, పెంటపాడు

ఘాటు దిగింది..

దిగొచ్చిన అల్లం, వెల్లుల్లి ధరలు



తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అల్లం, వెల్లుల్లి ధరలు సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయి. రానున్నది ఊరగాయల సీజన్..వెల్లుల్లి ధరలు అందుబాటులోకి రావడం పచ్చళ్ల ప్రేమికులకు ఊరటనిచ్చే అంశం. వెల్లుల్లి ధర కిలో రూ.500 వరకూ వెళ్లగా ప్రస్తుతం రూ.160కి విక్రయి స్తున్నారు. ఇప్పటి వరకూ నాణ్యమైన అల్లం కిలో రూ.350 పైగా విక్రయించగా ప్రస్తుతం రూ.100కు దిగివచ్చింది. దీంతో నెలల తరబడి ఆకాశంలో ఉన్న అల్లం, వెల్లుల్లి ధరలు సామాన్యులకు అందుబాటులోకి వచ్చినట్లయింది. గతేడాది నవంబరు నుంచి ప్రస్తుతం జనవరి వరకూ వెల్లుల్లి ధరలు రూ.450 నుంచి 500 పలకగా ప్రస్తుతం వెల్లుల్లి ధరలు రూ.160 నుంచి 200కు రిటైల్‌గా విక్రయిస్తున్నారు. గడచిన మూడు నెలల్లో అల్లం ధర రూ.300 నుంచి 350 పలకగా వ్యాపారులు సైతం అల్లం పేరుచెబితే భయపడే పరిస్థితి ఉండేది. గతంలో కూరగాయలు కొనేవారికి కొసరుగా అల్లం ఇచ్చేవారు. మూడు నెలలుగా అల్లం అడిగితే హడలెత్తిపోతున్నారు. వెల్లుల్లి పరిస్థితి అయితే మరీ దారుణం. వ్యాపారులు వెల్లుల్లి కొనుగోలు చేసే ధైర్యం చేయడం లేదు. చిన్న కిరాణా దుకాణాల్లో రూ.10కి వెల్లుల్లి అడుగుతుంటారు. వీరి కోసం చిన్నపాటి వెల్లుల్లి రెమ్మలు అందించి వ్యాపారాలు కొనసాగించేవారు. ప్రస్తుతం వీటి ధరలు అందుబాటులోకి రావడంతో వ్యాపారం జోరందుకుంటుందని చెబుతున్నారు.

దిగుబడి ఆశాజనకంగా..

గతేడాది పెద్దగా వెల్లుల్లి ధరలేకపోవడం, డిమాండ్ కూడా తక్కువగా ఉండటంతో సాగు తగ్గించారు. అయితే పది నెలలుగా ధరలు బాగుండడంతో రైతులు వెల్లుల్లి సాగుపై దృష్టి సారించారు. దీనికి తోడు ప్రభుత్వం కూడా వెల్లుల్లి సాగును ప్రోత్సహించడంతో మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లలో వెల్లుల్లి సాగు పెరిగింది. అల్లం సాగుచేసే విశాఖ ప్రాంతంలో పంట పెంచడం, దిగుబడి పెరగడంతో ధరలు దిగివచ్చాయి.

పనస.. కాని పనస

పనస పండులా ఉండే బ్రెడ్ ఫ్రూట్

పోలవరంలో విరగ కాసింది..

పోలవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పనస పండు అంటే ఇష్టపడని వారు ఉండరు.. వేసవిలో తాటిముంజలతో పాటు విరివిగా దొరికే పండు పనస పండు. పనస పండంటే సాధారణంగా ఐదు కేజీల నుంచి 50 కేజీల వరకూ బరువు తూగే పండ్లు కూడా ఉంటాయి. కానీ కేవలం కిలో బరువు మాత్రమే ఉండి ఆకారంలో పనసపండు లాగే ఉండి కత్తితో కూడా కోయవలసిన అవసరం లేకుండా ఎక్కువ జిగురు, ఎక్కువ పాలు లేకుండా సింపుల్‌గా అరటి పండు ఒలిచినట్లు ఒలుచుకునే పనసపండుని ఎవరైనా చూశారా ? అలాంటి పనస కూడా ఉంటుందా అంటారా ? ఉందండి బాబూ..దాని పేరే మన వాడుక భాషలో సదా పనస..ఇది విదేశీ పండు..సముద్రపు లంకల్లో ద్వీపాల్లో పండే ఈ పండుని బ్రెడ్ ఫ్రూట్ అని పిలుస్తారు. ఈ పండు మొక్కను పోలవరం గ్రామానికి చెందిన అర్చకుడు రాంబాబుకి ఎవరో గిఫ్టుగా ఇస్తే తీసుకొచ్చి పెరట్లో నాటారు. అది పెద్ద వృక్షమై ఇప్పుడు విరగకాసింది. పెద్ద పెద్ద ఆకులతో పనస చెట్టు కంటే విభిన్నంగా ఉండి కాయలు కాశాయి. విభిన్నంగా ఉన్న ఆ పనసచెట్టుని గ్రామస్థులు వింతగా చూస్తున్నారు.



పోలవరంలో అర్చకుని ఇంట్లో బ్రెడ్ ఫ్రూట్ చెట్టు

ఇక్కడా పండుతాయి

ఈ పండు అనేక ద్వీప దేశాలలో ముఖ్యమైన ఆహార పంటగా పండిస్తారు. ఈ పండులో కార్బోహైడ్రేట్లు, ఫైబర్, ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. వీటిని కాయదశలో ఉన్నప్పుడు కూరల్లా వండుకోవచ్చు. ముదిరిన పండ్లు తీయగా ఉంటాయి కేకులు, ఇతర స్వీట్ల తయారీలో ఉపయోగించవచ్చు. విత్తన జాతికి చెందిన బ్రెడ్ నట్ పనసలో గింజలు పిస్తా మాదిరిగా రుచిగా ఉంటాయి. ఈ చెట్టు నుండి లభించే రబ్బరు (లాటెక్స్) వాటర్ ట్యాంకుల లీకేజీలు మూయడానికి, పైపులు కలపడానికి గమ్‌లా ఉపయోగిస్తారు. మొక్క నాటిన నాలుగు నుంచి ఐదు సంవత్సరాలలో పూతకొస్తాయి. 10 నుంచి 20 ఏళ్ళ వయసున్న చెట్లలో ప్రతి ఏడాది సగటున 150 నుంచి 250 పండ్లు దిగుబడినిస్తాయి. తేనె టీగలు, పక్షులు కోతుల వంటి ప్రాణులు వీటిని ఎక్కువగా ఆహారంగా స్వీకరిస్తాయి. లంక ప్రాంతాలు, సముద్ర తీర ప్రాంతాలు కూడా ఈ పంట సాగుకి అనుకూలమే.





శ్రీవారి ఆలయంలో అభిమానితో నటుడు బాలాజీ

అనంతాళ్వార్ జీవితంపై సినిమా తీస్తా..

ద్వారకాతిరుమల స్వామివారి సన్నిధిలోనే ప్రారంభిస్తా : నటుడు బాలాజీ

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి కైంకర్యంలో తరించిన భక్తాగ్రేశ్వరుడు అనంతా ళ్వార్ కథను సినిమాగా తీసి నేటి యువ తరానికి భక్తి విలువను తెలియజేస్తానని ప్రముఖ సినీనటుడు, కారెక్టర్ ఆర్టిస్ట్ బాలాజీ తెలిపారు. ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ఆయన గురువారం సందర్శించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. దర్శనానంతరం ఆయనను పలువురు అభిమానులు గుర్తించి ఆయనతో ఫొటోలు దిగారు. అనంతరం ఆయన విలెకర్లతో మాట్లాడుతూ అనంతాళ్వార్ సినిమాను తాను త్వరలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే కథ సిద్ధమైందని నటుల ఎంపిక జరుగుతుందన్నారు. త్వరలో ఈ సినిమాను ద్వారకా తిరుమల స్వామివారి సన్నిధిలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. తాను ఇప్పటి వరకూ 250 పైబడి సినిమాల్లో వివిధ క్యారెక్టర్లను పోషించానన్నారు. తమిళ, తెలుగు బుల్లితెర సీరియల్స్ 60 వరకూ చేసినట్లు వివరించారు. ఈ సినిమా ద్వారా భక్తి విలువలు చాటి చెప్పాలని ఉందని తెలిపారు.



భీమడోలు మండలం కోడూరుపాడులో పరిశీలిస్తున్న బృంద సభ్యులు

ప్రకృతి సేద్యం పరిశీలించిన అమెరికా బృందం

ఉంగుటూరు /భీమడోలు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రసాయన విధానం నుంచి రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని సేంద్రియ సాగును బలోపేతం చేయాలని అమెరికా వైట్ హౌస్ మాజీ జాతీయ వాతావరణం సలహాదారు గీనా మెకార్తీ, క్రేగ్ కాట్‌లు పేర్కొన్నారు. ఉంగుటూరు మండలం అక్కుపల్లి గోకవరం, భీమడోలు మండలం వడ్లపట్ల, కోడూరు గ్రామాలలో పలు క్షేత్రాలలో పరిశీలించారు. రైతు సాధికారిక సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌ఛైర్మన్ టి.విజయకుమార్ నేతృత్వంలో అక్కుపల్లిగోకవరంలోని సురభి గోశాలను సందర్శించి ప్రకృతి వ్యవసాయం నవ సూత్రాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. విత్తన గుళికల తయారీ, ఘన జీవామృతం ,అగ్నాస్త్రం వంటి విధానాలను పరిశీలించారు. భీమడోలు మండలంలోని కోడూరుపాడులో రామచంద్రరావుకి చెందిన 8 ఎకరాల కొబ్బరి తోటలో వేసిన అరటి, వక్క, కూరగాయల వంటి అంతర పంటలను పరిశీలించారు. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం బలోపేతం చేయడం కోసం కృషి చేస్తున్నట్లు బృంద పరిశీలకులు పేర్కొన్నారు. రైతు సాధికారిక సంస్థ సీనియర్ అధికారులు అరుణ, ప్రభాకర్, జిల్లా మేనేజర్ తాతారావు పాల్గొన్నారు.



జిల్లా జైలుకు ఎదురుగా సీసీ కెమెరాను బిగిస్తున్న టెక్నీషియన్

ప్రధాన కార్యాలయాల వద్ద సీసీ కెమెరాలు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులో జిల్లా కేంద్ర కారాగారం (జిల్లా జైలు)కు ఎదురుగా సీసీ కెమెరాలను గురువారం సాయంత్రం ఏర్పాటు చేశారు. జిల్లాలోని ప్రధాన రహదారులు నగరాలు, పట్టణాల్లోని ప్రధాన వీధుల్లో ఇప్పటి వరకూ సీసీ కెమెరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటిని జిల్లా పోలీస్ కార్యాలయానికి తరువాత రాష్ట్ర డీజీపీ కార్యాలయం, ముఖ్యమంత్రి కార్యాలయానికి అనుసంధానం చేశారు. అయితే మరోసారి ఎక్కడెక్కడ కెమెరాలు లేవో పరిశీలన జరిపారు. ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లోని పడమర వైపు (గూడ్స్‌షెడ్డు రోడ్డువైపు) బుకింగ్ కౌంటర్ వద్ద సీసీ కెమెరాను గురువారమే ఏర్పాటు చేశారు. ఇక జిల్లా జైలు వద్ద కూడా సీసీ కెమెరాల లేదని గుర్తించి జైలు ముందు గురువారం సాయంత్రం సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు. దీంతో ఏలూరులోని ప్రధాన వీధులతో పాటు ప్రభుత్వాసుపత్రి, కలెక్టరేట్, ఇతర కార్యాలయాల వద్ద సీసీ కెమెరాలు ఉన్నాయి. ఎక్కడ ఏ సంఘటన జరిగినా వెంటనే పరిశీలన చేయడానికి ఈ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని భావిస్తున్నారు.

డెల్టా కాలువలకు 8700 క్యూసెక్కుల నీరు విడుదల

ధవళేశ్వరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాటన్ బ్యారేజ్ నుంచి డెల్టా కాలువలకు 8700 క్యూసెక్కులు విడుదల అవుతున్నాయి.తూర్పుడెల్టాకు 2600క్యూసెక్కులు,మధ్యడెల్టాకు 1700క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4400క్యూసెక్కులు చొప్పున జలాలను విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం స్వల్పంగా పెరుగుదల నమోదు చేసుకుని 9.65 అడుగులకు చేరుకుంది. సీలేరు నుంచి విద్యుత్ ఉత్పత్తి ద్వారా 4 వేల క్యూసెక్కులు, బైపాస్ మార్గం ద్వారా 3 వేల క్యూసెక్కులు విడుదల అవుతుండగా గోదావరిలో నీటి లభ్యత 8700 క్యూసెక్కులుగా ఉంది.



వేల్పూరులోని బర్డ్‌ఫ్లూ ప్రభావిత ఫారంలో వైరస్ నివారణకు రైతులు వాడిన మందుల వివరాలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు, పశు సంవర్థక శాఖ జేడీ డాక్టర్ బొంబేలే, అధికారులు

బయో సెక్యూరిటీయే కోళ్లకు రక్షణ కవచం

వేల్పూరులో పరిశీలించిన కేంద్ర అధికారుల బృందం

తణుకు రూరల్, ఫిబ్రవరి 20, (ఆంధ్రజ్యోతి) : పౌల్ట్రీ ఫారాల్లో వైరస్‌లను నిర్మూలించినా రైతులను నష్టపోకుండా కాపాడేది బయో సెక్యూరిటీ పదద్ధతులేనని, కేంద్ర పశుసంవర్థక శాఖ అధికారులు, శాస్త్రవేత్త బృందం సూచించింది. గురువారం సాయంత్రం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని బర్డ్ ఫ్లూ ప్రభావిత కోళ్ల ఫారాలను పరిశీలించారు. పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్, ఇతర అధికారులు పౌల్ట్రీ ఫారాలను పరిశీలించి రైతులను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఫారాల్లో కోళ్లు ఏ తేదీ నుంచి చనిపోతున్నాయి.? ఏ రోజున ఎక్కు. కోళ్లు చనిపోయాయి ? వాటిని ఏం చేశారు. కోళ్లు చనిపోతున్నట్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లింది ఎవరు ? కోళ్లు చనిపోతుంటే ఎవరిని సంప్రదించారు. వారు ఏ మందులు సిఫార్సు చేశారు.? మొదటిలో బర్డ్ ఫ్లూ వచ్చినప్పుడు ఎన్ని కోళ్లు చనిపోయాయి? వాటిని ఏంచేశారు.. వంటి ప్రశ్నలకు రైతుల నుంచి సమాధానాలు రాబట్టారు. వాటితో పాటు కోళ్లు చనిపోతున్నప్పుడు వాడిని మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫారంలో మొత్తం ఎన్ని కోళ్లుండేవి, చివరకు ఎన్ని కోళ్లను, గుడ్లను, మేతను ఖననం చేశారు. వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పౌల్ట్రీ ఫారాల పరిసరాలను పరిశీలించారు. కేంద్ర ఎస్ఆర్‌డీడీఎల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర హెడ్గే, ఐసీఏఆర్ సీనియర్ సైంటిస్ట్‌లు డాక్టర్ ఎండీ మద్సార్ చాంద్, డాక్టర్ మనోజ్‌కుమార్, డాక్టర్ ఎన్టీయార్ వెటర్నరీ యూనివర్సిటీ మైక్రో బయాలజీ ప్రొఫెసర్ కేవీ సుబ్రహ్మణ్యం, రాష్ట్ర పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ దామో దర్ నాయుడు, జిల్లా జాయింట్ డైరెక్టర్ మురళీ కృష్ణ, డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్, కరణం శంకర్ భావనారాయణ, ఇతర పశు సంవర్థక శాఖ అధికారులు, పౌల్ట్రీ రైతులు పాల్గొన్నారు. ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ కేంద్ర అధికారుల బృందం పరిశీలించారు.

నేడు బాదంపూడిలో పర్యటన

ఉంగుటూరు : ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం బాదంపూడిలో బర్డ్‌ఫ్లూ నిర్ధారణ అయిన ప్రాంతాన్ని గురువారం సందర్శించాల్సి ఉంది. అయితే ఈ బృందం పశ్చిమ గోదావరి జిల్లా వేల్పూరు వెళ్లింది. బాదంపూడి శుక్రవారం ఈ బృందం పర్యటించనున్నదని పశు సంవర్థక శాఖ వైద్యాధికారిణి డా.శిరీష వివరించారు.

కుళ్లిన గుడ్లతో పఫ్



పఫ్ కుళ్లిన లోపలభాగం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల మండలం ద్వారకానగర్ పరిధిలోని భీమడోలు జంక్షన్‌లోని ఓ బేకరీలో కుళ్లిన కోడిగుడ్డుతో చేసిన పఫ్ అమ్మకాలపై ఓ వినియోగదారుడు నిలదీశాడు. నీ ఇష్టమొచ్చింది చేసుకో అంటూ బేకరీ యాజమాన్యం నిర్లక్ష్యంగా సమాధానం చెప్పా రంటూ వినియోగదారుడు వాపోయాడు. భీమడోలు సమీపంలోని పెదలింగపాడు గ్రామానికి చెందిన పులిపాటి రాజు జంక్షన్‌లోని ఓ బేకరీలో గురువారం సాయంత్రం ఎగ్‌పఫ్‌లు కొన్నాడు. ఇంటికి వెళ్లి పిల్లలకు పెడితే వారు నోట్లో పెట్టుకుని తినలేకపోయారు. పరిశీలిస్తే అవి వాసన వస్తున్నాయి. దీంతో భీమడోలు వచ్చి షాపువారిని ప్రశ్నిస్తే అలాంటిదేమి లేదు...నీ ఇష్టమొచ్చింది చేసుకో అంటూ సమాధానమివ్వడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫోన్ చేసినట్లు రాజు వివరించాడు. అసలే బర్డ్‌ఫ్లూ భయాలతో కోళ్లకు, కోడిగుడ్లకు దూరగా ఉంటున్నారని ఇలాంటి పరిస్థితుల్లో జాగ్రత్తలు తీసుకోకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశాడు.

సైకిల్‌కు సవాల్



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి పోటీలో వున్న అభ్యర్థులంతా ప్రచారానికి మరింత పదును పెట్టారు. క్షేత్రస్థాయిలో గట్టి నాయకత్వ పట్టున్న టీడీపీ ఎట్టి పరిస్థితుల్లోను ఈ స్థానం నుంచి తమ పార్టీ బలపరిచిన అభ్యర్థి గెలిచి తీరాలనే పట్టుదలతో ఉంది. సీఎం చంద్రబాబునాయుడు నుంచి ముఖ్య నేతలంతా ఎప్పటికప్పుడు నియోజకవర్గాల వారీగా సమాచారాన్ని రాబట్టడమే కాకుండా అప్పటికప్పుడే సమీక్షిస్తున్నారు. ప్రచారంలో ఎక్కడ వెనుకబడ్డారు ? ఎక్కడ దూసుకువెళ్తున్నారనే విషయంపై తగిన సూచనలు ఇస్తున్నారు. అన్నిచోట్ల కూటమి ఎమ్మెల్యేలే ఉండడంతో తమ అభ్యర్థిని అలవోకగా గెలిపించాలని భావించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను బేరీజు వేసుకుని ఆ మేరకు ఓటర్లను ప్రత్యక్షంగా కలవడం, యువత కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించడం, పట్టభద్రులైన ఓటర్లంతా తరలి వచ్చేలా చేయడం అంత సులువు కాదని భావించి యంత్రాంగాన్ని మరింత అప్రమత్తం చేశారు. గత అనుభవాల దృష్ట్యా సాధారణ ఎన్నికల కంటేమించి ఎమ్మెల్సీ అభ్యర్థికి అత్యధిక ఓట్లు రావాలన్న షరతు విధించారు. దీంతో ఇప్పుడు కూటమిలో ఉన్న ఎమ్మెల్యేలు, మంత్రులతోపాటు మిగతా వారందరికీ ఈ ఎన్నిక ఒక సవాల్‌గా మారింది. ప్రత్యేకించి పట్టభద్రుల ఓటర్లు అత్యధికంగా ఉన్న మండల కేంద్రాలు, పట్టణాలు, కార్పొరేషన్ కేంద్రాల్లో తాజాగా ప్రచారాన్ని మోహరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి పక్షాన భారీగా మోహరింపు

సవాల్‌గా తీసుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

కలిసి నడుస్తున్న టీడీపీ, జనసేన..మిన్నకుండిన బీజేపీ

గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని మరీ పోరు

చెల్లని ఓట్లను తగ్గించి మెజార్టీ వైపు మళ్లించుకునే వ్యూహం

మా వాడే గెలవాలి

ఎన్నికల బరిలో 35 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. వీరిలో అత్యధికులు ప్రచారంలో శరవేగంగా ముందుకు సాగుతూనే ఉన్నారు. యువతకు మేలు జరగాలంటే తాము విధాన పరిషత్‌లో అడుగు పెట్టేలా చూడాలని ఓటర్లను అభ్యర్థిస్తూ వస్తున్నారు. తెలుగుదేశం పక్షాన పేరాబత్తుల రాజశేఖరం అభ్యర్థిగా ఉన్నారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, మంత్రులు, వివిధ విభాగాల కార్పొరేషన్ల చైర్మన్‌లు, సభ్యులతోపాటు స్థానిక సంస్థల ప్రతినిధులు ప్రచారంలో ఒక ఊపు తెస్తున్నారు. ఏ నియోజకవర్గంలో ఎంతెంత మంది ఓటర్లు ఉన్నది ఇప్పటికే గుర్తించినందున దీని ఆధారంగా ముందుకు వెళుతున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరికి చెందిన ఇన్‌చార్జి మంత్రులు గొట్టిపాటి రవికుమార్, నాదెండ్ల మనోహర్ కూటమి నేతలను ఏకం చేసి ఏ రోజుకారోజు నియోజకవర్గాల్లో స్థితిగతులపై ఆరా తీస్తున్నారు. జనసేన పక్షాన ఎమ్మెల్యేలుగా ఉన్న పోలవరం, ఉంగుటూరు, నరసాపురం, తాడేపల్లిగూడెం, నిడదవోలు వంటి నియోజకవర్గాల్లో ఎమ్మెల్సీ ఓటర్ల నాడిపై ఆ పార్టీ అధిష్ఠానం ఆరా తీస్తోంది. భారతీయ జనతా పార్టీ మాత్రం ఈ విషయంలో పెద్దగా చొరవ తీసుకున్న పరిస్థితి కనిపించడం లేదు. తెలుగుదేశం, జనసేన నేతలంతా ఉమ్మడిగా కలియ తిరుగుతుండగా, కమల నాదులు తమకు ప్రత్యేకించి ఆహ్వానం లేదన్నట్లు మిన్నకుండిపోతు న్నారు. మండలస్థాయిలోను ఇదే ధోరణిలో కనిపిస్తోంది.

చెల్లని ఓట్లే అత్యంత కీలకం

గడిచిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీగా చెల్లని ఓట్లు నమోదయ్యాయి. అప్పట్లో రెండు లక్షల 20 వేలకుపైగా ఓట్లు ఉండగా వీటిలో లక్షా 92 వేల 24 ఓట్లు పోలయ్యాయి. 13 వేల 852 ఓట్లు చెల్లకుండా పోవడంతో అందరూ ముక్కున వేలేసు కున్నారు. పీడీఎఫ్ బలపరిచిన యిళ్ల వెంకటేశ్వరరావుకు 98 వేల 193 ఓట్లు లభించగా, సమీప ప్రత్యర్థి నల్లమిల్లి శేషారెడ్డికి 38 వేల 124 ఓట్లు దక్కాయి. ఈసారి ఎన్నికల్లో టీడీపీ పక్షాన రాజశేఖరం ఉండగా, పీడీఎఫ్ తరపున దిడ్ల వీరరాఘవులు పోటీ పడుతున్నారు. వీరిద్దరి మధ్య నువ్వా నేనా అన్నంతగా కూటమి పక్షాన వామపక్షాల తరపున హోరాహోరీగా ప్రచారం సాగుతోంది. వచ్చిన చిక్కల్లా ఏమిటంటే ఈసారి గతంకంటే లక్ష ఓట్లు అదనంగా అంటే మూడు లక్షల 15 వేలకుపైగా ఓటర్లు ఉన్నారు. సాధ్యమైనంత మేర చెల్లని ఓట్లు తగ్గించుకోవడం, ఆ మేరకు మెజారిటీ స్థానంలో వచ్చేలా చూడడం కూటమి పక్షాన నేతలందరికీ పెద్ద అగ్ని పరీక్షగానే మారింది. అందుకనే ప్రాధాన్యత ఓటు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా ఓటర్లందరికీ విడమరిచి మరీ చెబుతున్నారు. ఎన్నికల అధికారులు ఇచ్చిన పెన్నుతోనే బ్యాలెట్ పేపర్‌పై ఒకటవ ప్రాధాన్యత ఓటును ఒకటవ సంఖ్యగా వేయాల్సిందిగా పదే పదే చెబుతూ వస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇన్ టూ మార్క్ పెట్టవద్దని అభ్యర్థిస్తున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో మిగతా ఇండిపెండెంట్ సభ్యులు భారీగానే ఉన్నందున వీరంతా ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ప్రచారం ఉధృతస్థాయికి తీసుకువెళ్తున్నారు. గత ఎన్నికల్లో 43 మంది పోటీ పడగా 12 మంది అభ్యర్థులు మాత్రమే వెయ్యి సంఖ్యను దాటి ఓట్లు దక్కించుకోగలిగారు. ఈసారి టీడీపీకి పూర్తి అనుకూలత దక్కేలా కూటమి నేతలు మోహరించడంతో ఆ మేరకు మిగతా ఇండిపెండెంట్‌లకు వచ్చే ఓట్ల సంఖ్యలో చీలిక ఏర్పడే అవకాశం కనపడుతుంది.

మహా కుంభమేళాకు వెళ్లిరండి !

పారిశుధ్య పనులు పరిశీలించాలని మునిసిపల్ కమిషనర్లకు ఉన్నతాధికారుల సూచన

భీమవరం టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వచ్చే 2027లో జరిగే గోదావరి పుష్కరాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా భక్తుల రద్దీని ఏవిధంగా సమర్థవంతంగా ఎదుర్కోవాలి ? పారిశుధ్య చర్యలు ఏవిధంగా చేయాలి. కాలుష్యం లేకుండా ఎలా చూడాలి తదితర అంశాలను పూర్తిస్థాయిలో నిర్వహించేందుకు ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలోని పలువురు కమిషనర్లను మునిసిపల్ ఉన్నతాధికారులు ప్రయాగ్‌రాజ్ పంపించారు. ఉత్తరప్రదేశ్ ప్రయాగ్ రాజ్‌లోనిర్వహిస్తున్న కుంభ మేళాలో అక్కడ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకున్నారు. తదితర అంశాలు పరిశీలించాలని సూచించారు. ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన రాజమండ్రి కార్పొరేషన్ కమిషనర్, కొవ్వూరు, నిడదవోలు, నరసాపురం మునిసిపల్ కమిషనర్లను పంపించారు. వీరితోపాటు మునిసిపాలిటీలకు చెందిన టౌన్ ప్లానింగ్ అధికారులు, మునిసిపల్ ఇంజనీర్లను పంపించారు. మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ కమిషనర్లకు పలు సూచనలు చేశారు. రానున్న పుష్కరాల్లో తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటినుంచి ప్రణాళికలు సిద్ధం చేసి పుష్కరాలను విజయవంతం చేసేందుకు దోహదపడుతుందని ప్రభుత్వం భావించింది. అధికారులు అక్కడ పరిశీలన చేసి ఇచ్చే నివేదిక వచ్చే పుష్కరాల్లో ఎలా ఉపయోగపడుతుందో చూడాలి.

ఎన్నికల విధుల్లోని సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్

జేసీ ధాత్రిరెడ్డి



పోస్టల్ బ్యాలెట్ వివరాలను పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతీ ఉద్యోగి, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి చెప్పారు. ఏలూరు కలెక్టరేట్‌లో ఎన్నికల్లో విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ పత్రాల పంపిణీని జేసీ గురువారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 27న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో అర్హులైన సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ నమోదు చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బ్యాలెట్‌లకు నిబంధనల మేరకు సీలు సరిగ్గా ఉన్నదీ ? లేనిదీ సరిచూసుకుని నమోదు చేసుకోవాలని జిల్లా నోడల్ అధికారి ఆరిమిల్లి శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఈ కార్య క్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రతిభ విద్యాలయాలకు

దరఖాస్తుల ఆహ్వానం

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరంలో ప్రతిభా పాఠశాలలు, కళాశాలల్లో చేరేందుకు గిరిజన బాలబాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కె.ఆర్.పురం ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్, ఎగ్జామ్ కన్వీనర్ జి.వెంకయ్య తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చేరడానికి బాలురు పార్వతీపురం(పీటీజీ), జోగంపేట, శ్రీశైలం దరఖాస్తు చేసుకోవాలని, బాలికలు మారికవలస, విసన్నపేట, శ్రీకాళహస్తి, తనకల్లులో చేరడానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. 8వ తరగతిలో చేరడానికి బాలురైతే జోగంపేట, శ్రీశైలం, బాలికలైతే మారికవలస, శ్రీకాళహస్తి కేంద్రాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏలూరు జిల్లాలో తెలుగు, ఇంగ్లీష మీడియం చదివిన గిరిజన బాలబాలికలు మాత్రమే మార్చి 2వ తేదీలోపు ఆన్‌లైన్‌లో గురుకులం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. మార్చి 9న కె.ఆర్.పురం గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో ప్రవేశ పరీక్ష ఉదయం 10.30 గంటల నుంచి ఒంటి గంట వరకు ఉంటుందన్నారు.

డ్రెయినేజీలో పడి ఒకరి మృతి



తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో డ్రెయినేజీలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు సీఐ సుబ్రహ్మణ్యం ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు సీఐ మాట్లాడుతూ 45 సంవత్స రాల వయస్సు కలిగి బ్లూకలర్ షర్ట్ ధరిం చాడని, వివరాలు తెలిస్తే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

చేబ్రోలులో జీబీఎస్ లక్షణాలు

ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు

ఉంగుటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన ఒక మహిళకు జీబీఎస్ (గులియన్ బారో సిండ్రోమ్) లక్షణాలు కనిపించడంతో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం చేస్తున్నారు. చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.ఎస్.వర్మ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడంతో పాటు ఫీవర్ సర్వే చేశారు. ఈ మహిళకు ఈ నెల 14న తాడేపల్లిగూడెంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడి పరీక్షల్లో డెంగీ లక్షణాలు గుర్తించారు. ఆమెకు కాళ్లు తిమ్మిర్లు రావడంతో పరీక్షల అనంతరం జీబీఎస్‌గా నిర్ధారించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యాధికారి వర్మ తెలిపారు.

కథ అడ్డం తిరిగింది..!

బియ్యం లోడు లారీ మాయం

మాటు వేసి నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రావణ్ కుమార్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పేదలకు ప్రభుత్వం అందించే రేషన్ బియ్యాన్ని అక్రమమార్గంలో కొనుగోలు చేసి ఆపై లారీల్లో బడా వ్యాపారులకు విక్రయించేవాడు.. కొడితే ఏనుగు కుంభస్థలాన్నే కొట్టాలనే తలంపుతో ఏకంగా ఎఫ్‌సీఐ గోడౌన్‌కు వెళ్లే బియ్యం లారీని తస్కరించి విక్రయించడానికి ప్రయత్నించి పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ కేసు వివరాలను తెలిపారు. ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లిలోని రాజమ్మ రైస్ ఇండస్ట్రీస్ నిర్వాహకుడు బి.వెంకట్రాజు ఒక లారీలో 290 బస్తాల బియ్యాన్ని ఏలూరు ఎఫ్‌సీఐ గోడౌన్‌కు ఈ ఏడాది జనవరి 28న తరలించారు. అయితే అక్కడ రోడ్డుపై పెట్టి వెయిటింగ్‌లో ఉంచారు. రేషన్ బియ్యం అక్రమమార్గంలో రవాణా చేసి 14 కేసుల్లో అరెస్టయ్యి జైలుకు వెళ్లివచ్చిన జన్యావుల సుధాకర్ లారీని తస్కరించాలని ప్రణాళిక చేసుకున్నాడు. అతనికి పెరవలి మండలం నడిపల్లి గ్రామానికి చెందిన దూడల ధనరాజు (29),ఉండ్రాజవరానికి చెందిన కొల్లేపర మణికంఠ(30)లు సహకరించారు. ఈ ముగ్గురు కలిసి 28వ తేదీ అర్ధరాత్రి దాటిన తరువాత ఆ లారీని తస్కరించి విశాఖ తీసుకెళ్లి విక్రయించడానికి ప్లాన్ చేశారు. బియ్యం యజమాని వెంకటరాజు ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ఉదయం బాదంపూడి హౌసింగ్ బోర్డు కాలనీ శివారు దత్తాశ్రమం వెనుక పంట పొలాల్లో ఖాళీ రేకుల షెడ్డు పక్కన మణికంఠ పౌండ్రీస్ వద్ద ఈ లారీని ఉంచారు. సమాచారం అందుకున్న పోలీసులు మాటు వేసి ముగ్గురినీ అరెస్టు చేసి లారీని, బియ్యం లోడును ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ సమావేశంలో డీఎస్పీతో పాటు వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, ఏలూరు రూరల్ ఎస్ఐ సి.హెచ్.కె.దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.



సొమ్మసిల్లి పడిపోయిన శ్రీనివాసరావు

ఊడిన చక్రాలు

మినీ వ్యానుపై టైల్స్ వేసుకొస్తూ రోడ్డు ప్రమాదం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా మంగళగిరి మండలం ఆత్మకూరుకు చెందిన రెడ్డి శ్రీనివాసరావు మినీ వ్యాను తోలుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శ్రీనివాసరావుకు స్టంట్లు పడటంతో అతనికి తోడుగా భార్య పద్మావతి కూడా అదే వ్యానులో ఉంటోంది. దురదృష్ట వశాత్తు భర్త నడపుతున్న వ్యాను వెనుక చక్రాలు అకస్మాత్తుగా ఊడిపోవడంతో రోడ్డు ప్రమాదానికి గురై ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలంలో ఉన్న టైల్స్ ఫ్యాక్టరీకి గురువారం మధ్యాహ్నం టైల్స్‌ను లోడుతో తిరిగి మంగళగిరి బయల్దేరారు. 16వ నెంబర్ జాతీయ రహదారిపై వెళ్తుండగా మార్గ మధ్యలో ఏలూరు సమీపంలోని మెయిన్ బైపాస్ సోమవరప్పాడు బ్రిడ్జి డౌన్‌లో అతి వేగంగా వెళ్తున్న వ్యాను వెనుక చక్రాలు ఊడి రెయిలింగ్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. టైల్స్ రోడ్డుపై చెల్లాచెదరుగా పడిపోయాయి. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు హుటాహుటిన వెళ్లి క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్య వక్త మాధవ్

అభివృద్ధే ధ్యేయంగా

కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు

కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

భీమవరంటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ నాయకత్వంలో అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా కేంద్రం బడ్జెట్ ప్రవేశ పెట్టడం జరిగిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. గురువారం భీమవరంలోని కేఎస్ రాజు కన్వెన్షన్ హాల్లో జిల్లా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ నర్సాపురం పార్లమెంట్ కన్వీనర్ సుభాష్ రాజు అధ్యక్షతన కేంద్ర బడ్జెట్ పై మేధావుల సమావేశం నిర్వహించారు.బడ్జెట్ పై మేధావులకు, వ్యాపారులతో పాటు అన్ని వర్గాల వారికి అవగాహన కల్పించడం కోసమే ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నత్త నడకన సాగిన జల జీవన్ మిషన్ ప్రాజెక్టును 2028 వరకు పొడిగించడం వల్ల ఏపీకి చాలా ప్రయోజనం చేకూరుతుందన్నారు. బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి భారీ కేటాయింపులు జరిగాయన్నారు. ఈ సమావేశానికి ముఖ్య వక్తగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ పీవీఎల్ మాధవ్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం మధ్యతరగతి ప్రజలకు మేలు చేయాలనే సంకల్పంతో పన్ను మినహాయింపు ఇవ్వడం సాహసోపేత నిర్ణయమన్నారు. పోలవరం, అమరావతి ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు కేటాయించడంతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చినట్టు మాధవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మొదట భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్ సెక్రటరీ కాగిత రమణ, తాడేపల్లిగూడెం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఈతకోట తాతాజీ, భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు న్యూట్రన్, ప్రొఫెసర్లు కృష్ణ చైతన్య, సునీల్ కుమార్ లు మాట్లాడుతూ బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చేలా ఉందని తెలిపారు. పెద్ద సంఖ్యలో వ్యాపారులు, న్యాయవాదులు, విద్యార్థులతో పాటు బిజెపి, జనసేన, టిడిపి కి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ జోగయ్య మానవత్వం

చిరుద్యోగుల పిల్లల చదువులకు ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న జోగయ్య

పాలకొల్లు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : మాజీ ఎంపీ చేగొండి వెంకట హరరామ జోగయ్య మానవత్వాన్ని చాటుకున్నారు. వయస్సు రీత్యా ఆరోగ్య సమస్యలతో పాలకొల్లులోని న్యూలైఫ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గత 20 రోజులుగా అక్కడే ఉన్న ఆయన ఆస్పత్రిలో పని చేసే నర్సులు, కాంపౌండర్లు, సిబ్బంది యోగ క్షేమాల గురించి ఆరా తీసి వారి ఆర్థిక పరిస్థితి తెలుసుకుని చలించిపోయారు. ఉదార భావంతో 22 మంది సిబ్బంది పిల్లల చదువుల నిమిత్తం ఒక్కొక్కరికీ 5 వేల రూపాయల చొప్పున లక్షా పదివేలను గురువారం సాయంత్రం అందించారు. ఈసందర్భంగా జోగయ్య మాట్లాడుతూ చిరుద్యోగుల పిల్లల చదువులకు పెద్ద మనస్సుతో సాయం చేయాలని అక్కడ ఉన్న ప్రముఖులకు, వైద్యులకు సూచించారు. ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటూనే తన ఉదారతను చాటుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సిహెచ్ సత్యనారాయణ మూర్తి (బాబ్జీ), న్యూలైఫ్ ఆసుపత్రి యాజమాన్యం తరపున డాక్టర్ వర్మ, పేరిచర్ల గోపాలరాజు అడ్డాల వాసు, డాక్టర్ లక్ష్మీపతి రాజు, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఒంగోలు రవి కుమార్, మానవత కన్వీనర్ ముత్యాల రామారావు, మానవతా ఆత్మీయ కమిటీ డైరెక్టర్ ముత్యాల శ్రీనివాస్, మానవత కోశాధికారి శ్రీవాత్సవ, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సమన్యాయం

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్న ప్రసాద్



మాట్లాడుతున్న రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు, బాధ్యతలు కల్పించిందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్న ప్రసాద్ అన్నారు. జాతీయ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా పెదవేగి మండలం కొప్పాక హైస్కూల్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ మాట్లాడుతూ పేదలకు ఉచితంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు సాయం అందిస్తున్నాయని అన్నారు. సంక్షేమ పథకాలు పొందడంలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదించవచ్చని తెలిపారు. మార్చి 8న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి యోగ్యమైన అన్ని క్రిమినల్, సివిల్, ఇతర కేసులను పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్ పి.వెంకటేశ్వరరావు, స్కూల్ హెచ్ఎం కె.శైలజ, పెదపాడు ఎస్ఐ కృపావరం తదితరులు పాల్గొన్నారు. తదనంతరం ఏలూరు శనివారపు పేటలోని బాలుర వసతి గృహాన్ని సందర్శించి బాలురకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత పరిసరాల శుభ్రతపై వివరాలు అడిగి తెలుసుకుని తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హోమ్ సూపరింటెండెంట్ శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

మొగల్తూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా పేరుపాలెం బీచ్ వెంబడి ఉన్న కొబ్బరి తోటల్లో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్టు మొగల్తూరు ఎస్ఐ జి.వాసు గురువారం తెలిపారు. పేరుపాలెం సౌత్ గ్రామంలో రిసార్ట్ సమీపంలో గల సీఆర్‌జెడ్ పరిధిలోని కొబ్బరి తోటల్లో గుళికలు సేవించి మృతి చెందాడన్నారు. మృతుడు చిలకపచ్చ బనియన్, జీన్ ప్యాంట్ ధరించి యున్నాడని, వయస్సు 26-30 ఏళ్ల లోపు ఉంటాయన్నారు. మృతుడి జేబులో ఒక మహిళకు సంబంధించిన పాన్ కార్డు ఉందని, మృతదేహం వద్ద గల ఫోన్ లాక్‌లో ఉండటంతో ఓపెన్ కావడం లేదని వీఆర్వో దుర్గారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహన్ని పోస్ట్ మార్టం నిమిత్తం నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుడు కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలానికి చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నామన్నారు.

ఉంగుటూరులో విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు

ఉంగుటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు సెక్షన్ పరిధిలో సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంగుటూరు గ్రామంలో విద్యుత్తు ఉండేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్టు ఏలూరు విద్యుత్తు శాఖ ఈఈ అంబేద్కర్ తెలిపారు. ఉంగుటూరు, నీలాద్రిపురం అగ్రికల్చర్ ఫీడర్ లకు పగలు ఇవ్వవలసిన కరెంటు రాత్రి సమయాల్లో 12.00 నుంచి ఉదయం 9 గంటల వరకు ఇవ్వనున్నట్టు తెలిపారు.

అమరావతిని ఫ్రీ జోన్‌గా ప్రకటించాలి

ఏలూరుకార్పొరేషన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : అమరావతిని ఫ్రీ జోన్‌గా ప్రకటించి 26 జిల్లాల నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలివ్వాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కో-కన్వీనర్ తోర్లపాటి రాజు డిమాండ్ చేశారు. గురువారం స్వార్థిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరావతిని ఫ్రీ జోన్ చేసి అక్కడ భర్తీ చేసే ఉద్యోగాల్లో 26 జిల్లాల నిరుద్యోగులకు అవకాశం కల్పించి డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులతో క్యాలెండర్ ప్రకటించాలని అన్నారు.

23న లయన్స్ రీజియన్ సమావేశం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ జిల్లా రీజియన్-2 రీజియన్ సమావేశం ఈ నెల 23న ఆదివారం చొదిమెళ్లలోని బాలాజీ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్టు రీజియన్ ఛైర్ పర్సన్ వి.రత్నకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్స్ జిల్లా 316బి పూర్వ గవర్నర్ బాదం బాలకృష్ణ, 316జి జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు, జిల్లా ప్రథమ వైస్ గవర్నర్ ఎన్.వి.వి.ఎస్.పాపారావు, జిల్లా ద్వితీయ గవర్నర్ డాక్టర్ డి.సుబ్బారావు, జిల్లా పూర్వ గవర్నర్‌లు, జోన్ ఛైర్ పర్సన్‌లు వస్తున్న సందర్భంగా అధిక సంఖ్యలో లయన్స్ సభ్యులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ప్రాణదాన ట్రస్టుకు ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ అందజేత

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయ ప్రాణదాన ట్రస్టుకు ఓ దాత, కంపెనీ ప్రతినిధులు గురువారం దాదాపు లక్ష రూపాయల విలువైన ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ను విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌కు చెందిన మిడ్‌వెస్ట్ కంపెనీ యజమాని రామ్ తరఫున యాజమాన్యం ఆలయ ఏఈవో రావిపాటి లక్ష్మణస్వామికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రథమ చికిత్సా కేంద్రం వైద్యులు రాజేంద్రప్రసాద్, డి.దుర్గాప్రసాద్‌లు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

పెదపాడు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : సత్యవోలు గ్రామంలో సాయిబాబా దేవాలయ 20వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవంలో జడ్పీ ఛైర్మన్ దంపతులు ఘంటా పద్మశ్రీ, టీడీపీ నాయకులు ఘంటా ప్రసాదరావులు పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో టి.ఆంజనేయులు, రంగారావు, పి.శ్రీనివాసరావు, బేత లక్ష్మి ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

పెదపాడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఆమీలు జమ కోరారు. పెదపాడు మండలం కొక్కిరపాడు గ్రామ సచివాలయంలో 0-6 సంవత్సరాల లోపు చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. చిన్నారుల ఆధార్ నమోదు ప్రక్రియను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి గణేష్, డిజిటల్ అసిస్టెంట్ రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌తో సత్వర సేవలు

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్ గవర్నెన్స్‌తో సత్వర సేవలు సాధ్యమని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కొలువుతీరిన నాటి నుంచి అనేక విప్లవాత్మక నిర్ణయాలతో ముందుకెళ్తున్నామన్నారు. ఇందులో భాగంగానే వాట్సాప్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుట్టామన్నారు. ప్రజల ఆలోచనల మేరకు రానున్న కాలంలో కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు.

త్వరలో ఉపాధి కార్మికుల ఖాతాల్లోకి వేతనాలు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన అధికారులు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'వేతనాల వేతలు' కథనంపై జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు స్పందించారు. ఏలూరు రూరల్ మండలంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ఆరు వారాలుగా వేతనాలు అందడం లేదని, ప్రత్యామ్నాయ పనులకు మరలిపోతున్నారనే కథనంపై జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథకం సంచాలకులు టీవీఎస్ రఘుబాబు స్పందించారు. మండలంలో 6 వారాలకు స్పందించి 4,138 వేతనదారులు పనిచేశారని వేతనాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో మూడు రోజుల్లో ఎఫ్‌టీవోలు అప్‌లోడ్ చేస్తామని తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే కూలీల వేతనాలను బ్యాంక్ ఖాతాలలో జమ చేయనున్నట్లు రఘుబాబు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో సీఐటీయూ నేతలు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా పీడీఎఫ్ అభ్యర్థి దొడ్డి వీరరాఘవులుకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు కోరారు. మండలంలో పలు ప్రాంతాల్లో ఆయన గురువారం ప్రచారం నిర్వహించారు. ఈక్రమంలో పంగిడిగూడెంలో ఆయన రైతు సంఘ నేతలతో కలిసి పట్టభద్రులను ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ నేత కట్టా భాస్కరరావు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాపై సీఎండీకి ఓ రైతు ఫిర్యాదు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విద్యుత్‌ను అర్ధరాత్రి వేళ ఇవ్వడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండలంలోని రామన్నగూడెం మాజీ సర్పంచ్, రైతు పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు వాట్సాప్ ద్వారా రాష్ట్ర విద్యుత్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. వ్యవసాయానికి ఇచ్చే త్రీఫేజ్‌ను గ్రూపులుగా విభజించి అర్ధరాత్రి సైతం సరఫరా చేయడంతో రైతులు నిద్రలు లేక ఇబ్బందులు పడుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మొక్కజొన్న, నిమ్మ, కోకో, పంటలకు సక్రమంగా నీరు పెట్టుకోలేక యాతన పడుతున్నారని తెలిపారు. అనువైన వేళల్లోనే వ్యవసాయ విద్యుత్‌ను ఇవ్వాలని కోరారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఆటో



ఏలూరు క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ స్తంభాన్ని ఆటో ఢీకొట్టడంతో విరిగిపోయి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. మితిమీరిన వేగంతో మలుపు వద్ద ఆటోను అదుపు చేయలేక విద్యుత్ స్థంభాన్ని ఢీ కొట్టాడు. దురదృష్ట వశాత్తు వెంటనే ఫీజులు తొలగిపోవడంతో ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. అయితే ఆటోలోని శ్రీపర్రు గ్రామానికి చెందిన జయమంగళ సత్యనారాయణ, ముంగర వెంకట రమణ, సైదు బండారమ్మలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ ఎస్ఐ సిహెచ్ దుర్గా ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆటోలకు స్థలం కేటాయించాలి : డ్రైవర్స్ యూనియన్

ఏలూరుకార్పొరేషన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఆటోలు నిలిపేందుకు స్టాండ్‌ను ఏర్పాటు చేయాలని ఏలూరు జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ నాయకులు ఎ.రాజు, బి.చంద్రశేఖర్ బృందం గురువారం ఏలూరు నగరపాలక సంస్థ కో-ఆప్షన్ మెంబర్ ఎస్ఎంఆర్ పెదబాబును కలుసుకుని వినతిపత్రాన్ని అందచేశారు. నగర పాలక సంస్థ సమీపంలో ఆటో స్టాండ్ లేకపోవడం వలన తాము ఇబ్బందులు పడుతున్నామని, నష్టపోతున్నామని తక్షణమే తమ ఉపాధి కల్పనకు ఆటో స్టాండ్‌ను కేటాయించాలని కోరారు.

శ్రీశైలం మల్లన్నకు శ్రీవారి దేవస్థానం పట్టు వస్త్రాలు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో జరుగుతున్న శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ద్వారకాతిరుమల దేవస్థానం తరపున ఈఓ ఎన్వీఎస్ఎన్ మూర్తి, అర్చకులు, అధికారులు స్వామికి పట్టు వస్త్రాలను సమర్పించారు.ఈ నెల 19 నుంచి శ్రీశైలంలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాల సందర్భంగా శివయ్యకు, అమ్మవార్లకు పట్టు వస్త్రాలిచ్చేందుకు ఇక్కడి నుంచి వారంతా వెళ్లారు. గురువారం సాయంత్రం వాటిని శిరస్సులపై ఉంచుకుని అక్కడి అధికారులు, అర్చకులకు అందజేశారు. ఈనెల 26న అక్కడ స్వామి, అమ్మవార్ల కల్యాణం జరుగనుంది.



స్వామి వారికి పట్టు వస్త్రాలు అందజేస్తున్న ఆలయ అధికారులు



భౌ... భౌ...

హడలెత్తిస్తున్న వీధి కుక్కలు
శ్రీరామవరంలో ఒకరిపై దాడి

దెందులూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : వీధి కుక్కలు అంగన్వాడీ చిన్నారులను, టీచర్లను, వాహనదారులను పాద చారులను హడలెత్తిస్తున్నాయి. ప్రతి గ్రామంలోనూ వీధి కుక్కలు పెరిగిపోయి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. గత రెండ్రోజుల క్రితం మండలంలోని పలు గ్రామాల్లో ఇద్దరిని గాయపరిచాయి. గురువారం దెందులూరు మండలం శ్రీరామవరంలోని దళితవాడలోని మినీ అంగన్వాడీ కేంద్రానికి చిన్నారులు వెళ్తుండగా వీధి కుక్కలు పిల్లలపైకి వచ్చాయి. వాటిని అడ్డుకునే ప్రయత్నంలో అంగన్వాడీ టీచర్ భారతిపై రెండు కుక్కలు దాడి చేశాయి. దీంతో వాహనదారులు, గ్రామస్థులు కర్రలతో భయపెట్టడంతో అవి పారిపోయ్యాయి. దీంతో గాయపడిన అంగన్వాడీ టీచర్‌ను స్థానిక ఆసుపత్రికి తరలించారు. వీధి కుక్కల నిర్మూలనకు పంచాయతీ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.



ఆటపాటలతో విద్యను నేర్పండి

జ్ఞానజ్యోతి శిక్షణలో అంగన్ వాడీలకు రీసోర్స్ పర్సన్ విజయలక్ష్మి సూచన



దెందులూరు శిక్షణలో పాల్గొన్న అంగన్‌వాడీలు

ఏలూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ సెంటర్లకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో విద్యాబుద్ధులు నేర్పాలని జ్ఞానజ్యోతి కార్యక్రమం రిసోర్స్ పర్సన్ కె.విజయలక్ష్మి సూచించారు. ఏలూరులోని ఈదర సుబ్బమ్మదేవి మున్సిపల్ స్కూల్ అంగన్‌వాడీ కార్యకర్తలు ఆరు రోజుల శిక్షణలో భాగంగా గురువారం నిర్వహించిన శిక్షణకు ఆమె హాజరై మెళకువలను వివరించారు. చిన్నారులకు సునాయాసంగా అర్థమయ్యేరీతిలో బోధన చేసేందుకు ఈ శిక్షణ కార్యక్రమం రూపొందించినట్లు విజయలక్ష్మి వివరించారు. ఈ కార్యక్రమంలో టి.జోషి, మీనాక్షి, కేఆర్‌పీ ఎస్కే ఫరీదా, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పెదపాడు : బోధనా నైపుణ్యాలపై అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను వినియోగించుకుని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులను పూర్తి స్థాయిలో తీర్చిదిద్దాలని పెదపాడు ప్రాజెక్టు అదనపు సీడీపీవో ఎం.ఎస్. రాజశేఖర్ అన్నారు. పెదపాడు జడ్పీ హైస్కూల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. డీఆర్పీలు శ్రీనివాస్, బాలసుబ్రహ్మణ్యం, పుష్ప కిరణ్‌లు పలు అంశాలను వివరించారు.

దెందులూరు : టీడీపీ కూటమి ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అంగన్వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి పేరుతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. చిన్నారుల ఉన్నత భవిష్యత్తును తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా దెందులూరు మండలంలోని 68 మంది అంగన్వాడీలకు సెక్టార్ సూపర్ వైజర్లు చిట్టమ్మ, శ్రీదేవి, పద్మభూషణం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పాండురంగారావు, జయపాల్‌లు ముగ్రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఏలూరు రూరల్ : ఏలూరు దొండపాడులోని ఉమా ఎడ్యుకేషన్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో గురువారం శనివారం పేట జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో 2016 దివ్యాంగుల హక్కుల చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో విజయలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ వైకల్య నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిజెప్పారు.

భీమడోలు : స్థానిక జడ్పీ హైస్కూల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతిపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి గురువారం ఏలూరు జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు కోఆర్డినేటర్ పంకజ్ కుమార్ ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారుల సమగ్ర అభివృద్ధికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మోనటరింగ్ అధికారి రామారావు, ఎంఈవో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పెదవేగి : అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత టీచర్లపైనే ఉందని మహిళా శిశు సంక్షేమ శాఖ పెదపాడు సీడీపీవో కె.విజయలక్ష్మి అన్నారు. పెదవేగి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న శిక్షణ తరగతులకు గురువారం హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తోందని అన్నారు.

ఉంగుటూరు : అంగన్వాడీలు ఇక నుంచి కార్యకర్త నుంచి విద్యా శాఖలో గౌరవాన్ని పొందుతారని ఏ.పి.సి. పంకజ్ కుమార్ అన్నారు. గురువారం ఉంగుటూరు హైస్కూల్లో జ్ఞాన జ్యోతి కార్యక్రమం భాగంగా పంకజ్ కుమార్ సందర్శించి పలు సూచనలు చేశారు.ఏ.ఎం.ఓ. రెడ్డి రామారావు మాట్లాడుతూ విద్యలో వెనుకబడిన చిన్నారులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని కోరారు.ఈ శిక్షణలో డీవైఈవో రవీంద్రభారతి మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యాబోధనలో మెళకువలు పాటించాలని అన్నారు. ఈ శిక్షణలో రిసోర్స్ పర్సన్లుగా అల్లు శ్రీను, శిరికి శివ, యు.శివకుమార్, బి.శ్రీలక్ష్మి, శారదామణి, సి.ఆర్.పి.లు పాల్గొన్నారు.

పేరాబత్తులను గెలిపించండి

విద్యాలయాలు, ప్రభుత్వ ఆఫీసుల్లో కూటమి నాయకుల విస్తృత ప్రచారం



చింతలపూడిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

దెందులూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపునకు సహకరించాలని పట్టభద్రులను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కోరారు. గురువారం దెందులూరులోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి కరపత్రాలను అందజేశారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి మిల్లుబాబు, గారపాటి కొండయ్య చౌదరి, ఇప్పిలి వెంకటేశ్వరరావు ఉన్నారు.

జీలుగుమిల్లి : పేరాబత్తుల రాజశేఖరంను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు కోరారు. జీలుగుమిల్లి జడ్పీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏపీ గిరిజన గురుకుల పాఠశాలలో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ జనసేన బీజేపీ మండలాధ్యక్షులు సుంకవల్లి సాయి, పసుపులేటి రాము, గుడ్ల రాంబాబు, కూటమి నాయ కులు గడ్డమణుగు రవి కుమార్, చిర్రి వెంకటేశ్వరరావు, బి.రాజబాబు ఉన్నారు.

కామవరపుకోట : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని కోరుతూ కూటమి నాయకులు ఖాన్‌వజీర్, పల్లంరాజు, మిత్ర బృందం గురువారం కొత్తూరులో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

చింతలపూడి : ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలంటూ పట్టణ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో కూటమి నాయకులు కొత్తపూడి శేషగిరిరావు, శ్రీనివాసరావు, ధర్మరాజు, కంభం సురేష్, తాటి సింహ, అప్పారావు, చీదరాల మధుబాబు, టి.రామారావు, కుమార్ రాజా పాల్గొన్నారు.

కుక్కునూరు : కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరం గెలుపు కోసం గురువారం చీరవల్లి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను పట్టభద్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు నాగేశ్వరరావు, గంజి రాంబాబు, సర్పంచ్ సత్యనారాయణ, కొండా రమణయ్య, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

భీమడోలు : ఉభయ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, భీమడోలులోని మానస ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లోని పట్టభద్రులను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా గన్ని వీరాంజనేయులు, ధర్మరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలను నెలకొల్పి యువతకు ఉపాధి కల్పన, ఉద్యోగులకు సకాలంలో జీతాల చెల్లింపునకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవతో కృషి చేస్తోందని ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు, గన్ని వీరాంజనేయులు అన్నారు. భీమడోలులోని పలు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను, గ్రామ సచివాలయ సిబ్బందిని, కూటమి టీడీపీ ఓట్లను అభ్యర్థించారు. వీరితో పాటు ఉంగుటూరు బీజేపీ కన్వీనర్ శరణాల మాలతీరాణి, నియోజకవర్గ ఎమ్మెల్సీ పరిశీలకులు సత్యనారాయణ, మూర్తియాదవ్, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు, ఉంగుటూరు నియోజకవర్గంలోని కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఏలూరు టూటౌన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయం ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పేరాబత్తుల రాజశేఖరం మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పరిశీలకురాలు ఆచంట సునీత, చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు, రెడ్డి నాగరాజు, సీహెచ్‌వీఎస్ వరప్రసాదరావు, బెల్లంకొండ కిషోర్ అమరావతి అశోక్, బొద్దాని శ్రీనివాస్, మంచెం మైబాబు, తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్లపై ఆర్డీవో సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో రమణ

కుక్కునూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : మండలంలో మహ శివరాత్రి ఏర్పాట్లపై జంగారెడ్డిగూడెం ఆర్డీవో గురువారం తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. మండలంలో ప్రధానంగా పెదరావిగూడెం, కౌండిన్యముక్తి శివాలయాలు ఉన్నాయి. గోదావరి తీరంలో భక్తులు స్నానాలు చేసే అవకాశం ఉన్నందున అక్కడ ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సంబంధిత అధికారులకు ఆర్డీఓ ఆదేశాలు జారీ చేశారు. అలాగే తాగునీటి సౌకర్యం,ఆలయంలో స్వామి దర్శనం చేసుకునే క్రమంలో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఇదే సమయంలో గోదావరి అవతలి తీరంలో ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి కూడా భక్తులు వెళ్లే అవకాశం ఉన్నందున పడవ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రమేష్ బాబు, ఎంపీడీఓ సుబ్బా రావు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పడవల యజమానులకు దిశానిర్దేశం

పోలవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : మహాశివ రాత్రి ఉత్సవాల్లో అనుమతి లేకుండా గోదావరిలో పడవలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ పవన్ కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాలు ఈ నెల 25 నుంచి 27 వరకు జరుగుతాయన్నారు. ఉత్సవాలు జరిగే మూడు రోజులు పోలవరం, పట్టిసీమ గూటాల, తాళ్ళపూడి పరిసర ప్రాంతాల్లో ప్రయాణికుల రవాణాకు వినియోగించే నాటు పడవలు, ఇసుక పడవలు అనుమతి లేకుండా గోదావరిలో నడపరాదని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీసీ నాయకుల సమావేశం

ఏలూరు రూరల్ , ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : స్థానికంగా గురువారం ఉమ్మడి తూర్పుపశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కట్ట వేణుగోపాల్‌కు మద్దతుగా వివిధ ప్రజా సంఘాల సమావేశం రాష్ట్ర బీసీ నాయకులు సూర్యం మాస్టర్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా బీసీ చైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు వీరవల్లి శ్రీనివాస్, ఏపీ బీసీ ఓబీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్వీఆర్ విటల్‌కుమార్ మాట్లాడుతూ బహుజనులంతా కట్ట వేణుగోపాల్‌కృష్ణ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కట్ట వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ పలు ప్రజా సంఘాల మద్దతులో సమస్యలపై పోరాడుతున్నట్టు తెలిపారు.

తాగు, సాగునీటిని అందించండి


దెందులూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : దెందులూరు, ఏలూరు రూరల్ మండలాల పరిధిలో గోదావరి కాల్వ పరిధిలో తాగు, సాగునీటికి ఇబ్బందులు లేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని గోదావరి కాల్వ ఇరిగేషన్ ఎస్ఈ నాగార్జునరావు డీఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏఈ సుబ్బులను గోదావరి కాల్వ నీటి వినియోగదారుల సంఘం(డీసీ) ఛైర్మన్ వెలమాటి రాంబాబు కోరారు. గురువారం గోదావరి కాల్వ పరిధిలోని గుండుగొలను, ఉండ్రాజవరం, దెందులూరు, కొవ్వలి అడ్డరోడ్డు సమీపంలోని గోదావరి కాల్వను పరిశీలించి సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు గంధం లక్ష్మణ్, పర్వతనేని రంగారావు మాట్లాడారు.

కైకరంలో వార్షిక బ్రహ్మోత్సవాలు

ఉంగుటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు మండలం కైకరంలో ఉన్న చిద్వేంకట బ్రహ్మానంద మహర్షి వారి నిలయంలో గురువారం 53వ వార్షిక సప్తాహ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని లలిత దంపతులచే కలశ స్థాపన చేశారు.తొలి రోజు భజన కార్యక్రమంతో పాటు ఆధ్యాత్మిక వేత్త జటావల్లభుల రామమూర్తి ఆధ్యాత్మికోపన్యాసం చేశారు.

బడ్జెట్‌లో రైతుల ప్రస్తావన లేదు

ఏలూరుకార్పొరేషన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ కాపులను కొట్టి గెద్దలకు పంచే విధంగా ఉందని కార్మికులు, రైతాంగంపై భారాలు వేసి కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టే విధంగా ఉందంటూ వామపక్ష పార్టీలు ముక్తకంఠంతో విమర్శించాయి. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వామపక్షాల నాయకులు ఎ.రవి, ఎస్.నాగరాజు, బండి వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాస్, కె.రామకృష్ణ, ఆర్.లక్ష్మణరావు, దొంత కృష్ణలు మాట్లాడుతూ దేశంలో నూటికి 70 శాతం వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని, వీరికి కేంద్ర బడ్జెట్‌లో కేవలం 2.51 శాతం రూ. లక్షా 71 వేల 437 కోట్లు మాత్రమే కేటాయింపు చేశారన్నారు. ఎరువుల సబ్సిడీలో రూ. 3 వేల 412 కోట్లు కోత విధించారన్నారు. వ్యవసాయ కూలీలు, కౌలు రైతుల గురించి బడ్జెట్‌లో ప్రస్తావనే రాలేదన్నారు.



ఏరివేసిన గెలలను పరిశీలిస్తున్న రైతు సంఘం

రైతుల ఇబ్బందులను గుర్తించండి

పామాయిల్ ఫ్యాక్టరీ వద్ద రైతుల ధర్నా

పెదవేగి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : అష్టకష్టాలు పడి పామాయిల్ గెలలను ఫ్యాక్టరీకి తీసుకొస్తే నాణ్యత లేదంటూ ఏరివేయడం సరికాదని ఆయిల్ పామ్ రైతుల సంఘం ధర్నా చేసింది. ఈ మేరకు పెదవేగి పామాయిల్ ఫ్యాక్టరీ వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. ఎన్నో ఇబ్బందులు అధిగమించి గెలలను ఫ్యాక్టరీకి తీసుకొస్తుంటే గెలలను తీసి పక్కన పెట్టేస్తున్నారని రైతులు వాపోయారు.గెలల ఏరివేత విషయంలో యాజమాన్యం పునరాలోచించాలని రైతులు విజ్ఞప్తి చేశారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ నూనె దిగుబడి శాతం(ఓఈఆర్) పేరుతో రైతులు తెచ్చిన ఆయిల్‌పామ్‌గెలలు గ్రేడింగ్‌చేస్తూ ఏరివేస్తున్నారని, ఇది అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో పెదవేగి, లింగపాలెం మండలాలకు చెందిన రైతులు మన్నే బాబూరావు, బొల్లు రామకృష్ణ, తాతినేని రమేష్, బొప్పన పూర్ణచంద్రరావు, మురళి, జాస్తి ధర్మారావు, ఎన్.శ్రీనివాసరాజు, బి.రామచంద్రరావు, మంతెన జగన్మోహనరావు, బి.వీరవెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

పీవీవీ ప్రకాష్, ఎంపీడీవో, ద్వారకాతిరుమల



● గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ ఎలా ఉంది?

జవాబు : అన్ని గ్రామాల్లో పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే తడి, పొడి చెత్తల నిర్వహణకు ఏర్పాటు చేసిన డబ్బాలను మండల వ్యాప్తంగా 19,180 ఇళ్లకు అందజేశాం.

● ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చర్యలేమిటి?

జవాబు : మండలంలోని అన్ని పంచాయతీల్లో సాలిడ్ వేస్ట్ ప్రోసెసింగ్ సెంటర్(ఎస్‌డబ్ల్యూఎంఎస్) షెడ్లను ఏర్పాటు చేశాం. ద్వారకాతిరుమలలో ఆ షెడ్ వద్ద మోడల్ కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ప్రజారోగ్యాన్ని కాపాడుతున్నాం

● రోడ్ల మరమ్మతులకు చర్యలేమిటి?

జవాబు : ఉపాధి హామీ పథకంలో భాగంగా 26 సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.3.31 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటికే 24రోడ్లు పూర్తయ్యాయి. కొత్తగా మరో 30 రోడ్ల నిర్మాణానికి రూ.533.65 లక్షలు మంజూరయ్యాయి.

● తాగు నీటి సమస్యపై చర్యలేమిటి?

జవాబు : మండలంలోని 28 పంచాయతీల్లో ఐదు చోట్ల మంచి నీటి సమస్య లేదు. 13 పంచాయతీల్లో జలజీవన్ మిషన్ ద్వారా రూ.2.40 కోట్లతో పనులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అలాగే మరో 10 పంచాయతీల్లో బోర్‌వెల్స్ తవ్వకానికి కోటి రూపాయలతో జడ్పీకి ప్రతిపాదనలు పంపాం. ఈలోగా మంచినీరు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

ద్వారకాతిరుమల,(ఆంధ్రజ్యోతి)

బాధితులను ఆదుకుంటాం

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిగూడెంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి బాధితులు చోడెం రాంపండు కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు తెలిపారు. గురువారం గ్రామంలో పర్యటించి బాధితులను పరామర్శించారు. నిత్యవసర సరుకులు, 10వేలు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొగపర్తి సోంబాబు, యంత్రప్రగడ శ్రీనివాసరావు, ఆండ్రు శ్యాంకుమార్, కొమరం మల్లేశ్వరావు, పూసం ముక్కమ్మ, కంగాల రామమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

పోలవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలంలో 33/11 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ పీర్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సబ్ స్టేషన్ పరిధిలో పోలవరం గూటాల పట్టిసీమ, రామయ్యపేట, కృష్ణారావు పేట, ఇటుకల కోట గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

జీలుగుమిల్లి, ఫిబ్రవరి, 20 : (ఆంధ్రజ్యోతి) : గ్రామ ఇలవేల్పు జగదాంబ అమ్మవారి 68వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఉత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. గ్రామీణ ప్రాంతాల్లో సాంప్రదాయాలకు స్థానికులు ప్రాధాన్యత ఇచ్చి ఉత్సవాల్లో పాల్గొనాలన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ చిర్రి వెంకటేశ్వరావు, కుక్కునూరు జనసేన మండల పార్టీ అధ్యక్షులు ములిశెట్టి యుగంధర్, నాయకులు సరిపల్లి సత్యనారాయణరాజు, నాలి శ్రీను ఉన్నారు.

ఎంఆర్‌పీఎస్ అధ్యక్ష పదవిపై సమీక్ష

ఉంగుటూరు,ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా ఎం.ఆర్.పి.ఎస్. అధ్యక్ష పదవి తోపాటు రిజర్వేషన్ వర్గీకరణ అంశంపై గురువారం ఉంగుటూరు పి.వి.ఆర్.విద్యా కేంద్రంలో సమావేశం జరిగింది.ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు మామిడూరి ఏలియా అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్య, భర్తలకు గాయాలు

దెందులూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో భార్య భర్త లకు తీవ్రగాయాలయ్యాయి. 16వ జాతీయ రహదారి సత్యనారాయణపురం నుంచి గుండుగొలను వెళ్తున్న మోటార్ సైకిల్‌ను కారు ఢీ కొట్టింది. మేదిన రావుపాలెం గ్రామానికి చెందిన భార్య భర్తలకు మోటార్ సైకిల్ వాహనంపై జాతీయ రహదారి మీదుగా గుండుగొలను వెళ్తుండగా వాహనాన్ని కారు ఢీకొట్టడంతో భార్య భర్తలిద్దరికి తీవ్ర గాయలైయ్యాయి. దీంతో వారిని స్థానికులు అంబులెన్స్‌లో ఏలూరులోని ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి పోలీసులు విచారణ ప్రారంభించారు.

అగ్ని ప్రమాద బాధితులకు మానవత ఆర్థిక సాయం

కలిదిండి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కోరుకొల్లు పంచాయతీ బొబ్బిలిగూడేంకు చెందిన అగ్ని ప్రమాద బాధితులు గంజాల మల్లయ్య స్వామి కుటుంబసభ్యులకు గురువారం మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ.5 వేలు నగదు, 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేశారు. సంస్థ చైర్మన్ పేటేటి వివేకానంద, సేవా సంస్థ అధ్యక్షుడు పూర శ్రీధర్, కన్వీనర్ గోదావరి సత్యనారాయణ, డైరెక్టర్లు పాల్గొన్నారు.



నాగమ్మ తల్లికి చీరెలతో వస్త్రోత్సవం

ముదినేపల్లి : బొమ్మినంపాడులోని నాగమ్మ తల్లి ఆలయ 25వ వార్షికోత్స వాలు గురువారంతో ముగిశాయి. అమ్మవారికి భక్తులు చీరెలు సమర్పించి వస్త్రోత్సవం నిర్వహించారు. ఆల యం వద్ద అన్నసమారాధన జరిగింది. ఆలయ కమిటీ సభ్యు లు దామోర బుచ్చి బాబు, పాలంకి వెంకటేశ్వరరావు, చిట్టూరి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



వేల్పూరులోని బర్డ్‌ఫ్లూ ప్రభావిత ఫారంలో వైరస్ నివారణకు రైతులు వాడిన మందుల వివరాలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు, పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బొంబేలే, అధికారులు

బయో సెక్యూరిటీయే కోళ్లకు రక్షణ కవచం

వేల్పూరులో పరిశీలించిన కేంద్ర అధికారుల బృందం

తణుకు రూరల్, ఫిబ్రవరి 20, (ఆంధ్రజ్యోతి) : పౌల్ట్రీ ఫారాల్లో వైరస్‌లను నిర్మూలించినా రైతులను నష్టపోకుండా కాపాడేది బయో సెక్యూరిటీ పదద్ధతులేనని, కేంద్ర పశుసంవర్ధక శాఖ అధికారులు, శాస్త్రవేత్త బృందం సూచించింది. గురువారం సాయంత్రం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని బర్డ్ ఫ్లూ ప్రభావిత కోళ్ల ఫారాలను పరిశీలించారు. పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్, ఇతర అధికారులు పౌల్ట్రీ ఫారాలను పరిశీలించి రైతులను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఫారాల్లో కోళ్లు ఏ తేదీ నుంచి చనిపోతున్నాయి.? ఏ రోజున ఎక్కు కోళ్లు చనిపోయాయి ? వాటిని ఏం చేశారు. కోళ్లు చనిపోతున్నట్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లింది ఎవరు ? కోళ్లు చనిపోతుంటే ఎవరిని సంప్రదించారు. వారు ఏ మందులు సిఫార్సు చేశారు.? మొదటిలో బర్డ్ ఫ్లూ వచ్చినప్పుడు ఎన్ని కోళ్లు చనిపోయాయి? వాటిని ఏంచేశారు.. వంటి ప్రశ్నలకు రైతుల నుంచి సమాధానాలు రాబట్టారు. వాటితో పాటు కోళ్లు చనిపోతున్నప్పుడు వాడిని మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫారంలో మొత్తం ఎన్ని కోళ్లుండేవి, చివరకు ఎన్ని కోళ్లను, గుడ్లను, మేతను ఖననం చేశారు. వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పౌల్ట్రీ ఫారాల పరిసరాలను పరిశీలించారు. కేంద్ర ఎస్ఆర్‌డీడీఎల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర హెడ్గే, ఐసీఏఆర్ సీనియర్ సైంటిస్టులు డాక్టర్ ఎండీ ముద్సార్ చాంద్, డాక్టర్ మనోజ్‌కుమార్, డాక్టర్ ఎన్టీయార్ వెటర్నరీ యూనివర్సిటీ మైక్రో బయాలజీ ప్రొఫెసర్ కేవీ సుబ్రహ్మణ్యం, రాష్ట్ర పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ దామోదర్ నాయుడు, జిల్లా జాయింట్ డైరెక్టర్ మురళీ కృష్ణ, డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్, కరణం శంకర్ భావనారాయణ, ఇతర పశు సంవర్ధక శాఖ అధికారులు, పౌల్ట్రీ రైతులు పాల్గొన్నారు. ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ కేంద్ర అధికారుల బృందం పరిశీలించారు.

నేడు బాదంపూడిలో పర్యటన

ఉంగుటూరు : ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం బాదంపూడిలో బర్డ్‌ఫ్లూ నిర్ధారణ అయిన ప్రాంతాన్ని గురువారం సందర్శించాల్సి ఉంది. అయితే ఈ బృందం పశ్చిమ గోదావరి జిల్లా వేల్పూరు వెళ్లింది. బాదంపూడి శుక్రవారం ఈ బృందం పర్యటించనున్నదని పశు సంవర్ధక శాఖ వైద్యాధికారిణి డా.శిరీష వివరించారు.



కైకలూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్



కలిదిండిలో ప్రచారం చేస్తున్న రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, కూటమి నాయకులు

ప్రతీ ఓటరును కలిసి ఓట్లను అభ్యర్థించాలి

ఎమ్మెల్యే డాక్టర్ కామినేని

కైకలూరు/కలిదిండి/ముదినేపల్లి/చాట్రాయి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు కోసం ప్రతీ ఓటరు ఇంటికి వెళ్లి కూటమి నేతలు ఓట్ల ను అభ్యర్థించాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరు కల్యాణి ఫంక్షన్ హాలులో పట్టణంలోని కూటమి నేతలతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో 920 ఓట్లు ఉన్నాయని ఆయా ఓటర్లను కలిసి కూటమి అభ్యర్థి గెలుపు కోసం ఓట్లు వేయాలని అభ్యర్థించాలన్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ పీజేఎస్ మాల్యాద్రి, కూటమి నేతలు పెన్మెత్స త్రినాథ రాజు, పోలవరపు లక్ష్మీరాణి, ఎండీ జానీ, తెంటు నాగేశ్వరరావు, వీరాబత్తిన సుధా, మంగినేని రామకృష్ణ, తోట లక్ష్మీ, గరికిపాటి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

- కలిదిండిలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, డీసీ చైర్మన్ పేటేటి సత్య నారాయణ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు, బీజేపీ నాయకులు చిట్టూరి రవీంద్ర, చక్కా జగన్, సానామీనా సరస్వతి ప్రైవేట్ కళాశాలలకు వెళ్లి ఓట్లను అభ్యర్థించి కరపత్రాలను పంపిణీ చేశారు. పెద లంక, కొండంగి గ్రామాల్లో ఆలపాటిని గెలిపిం చాలని కోరారు. టీడీపీ నియోజకవర్గ పరిశీల కుడు మెంటే పార్థసారథి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్, డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస చక్రవర్తి, తదితరులు ప్రచారం నిర్వహించారు.
- ముదినేపల్లి మండలం అల్లూరులో తెలుగు యువత కైకలూరు నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు టీడీపీ నాయకులు పత్తి శివ దాసరి శ్రీను, బొమ్మనబోయిన వెంకట రత్నం తదితరులతో కలసి ఆలపాటి తరపున ఆయన ప్రచారం నిర్వహించారు.
- చాట్రాయి మండలం లోని చాట్రాయి, చను బండ, పోలవరం, చిన్నం పేట, మర్లపాలెం, సి.గుడిపాడు జడ్పీ హైస్కూల్స్‌కి వెళ్లి ఉపాధ్యాయు లు, సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, అధికారులను కలిసి పార్టీ పరిశీలకుడు గింజుపల్లి రమేష్, తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, టీడీపీ మండల మాజీ అధ్య క్షుడు మరిడి చిట్టిబాబు ఓటర్లను అభ్యర్థించారు. నాయకులు జక్కంపూడి ప్రదీప్‌కుమార్, కొత్తపల్లి రామదాసు, నేబుల్‌రెడ్డి, తల్లాడ శ్రీను, అందే కృష్ణ, పరసా శ్రీను తివిధ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కొల్లుపాడులో గురువారం రాత్రి టీడీపీ సీనియర్ నాయకులు నూతక్కి వేణు గోపాలరావు, జగ్గవరపు వెంకటరెడ్డి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు పర్వతనేని సాయి ఆలపాటిని గెలిపించాలని కోరుతూ ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



చనుబండ హైస్కూల్‌లో టీడీపీ నాయకుల ప్రచారం

ముగిసిన శిక్షణ తరగతులు

ముదినేపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జ్ఞానజ్యోతి కోర్సుపై అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. మండలంలోని 90 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు ముదినేపల్లి, పెద పాలపర్రు హైస్కూళ్లలో కైకలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో దీప్తి ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు సుందరమ్మ, ఝాన్సీ, రిసోర్స్ పర్సన్లు సివిఎల్.నరసింహారావు, ఎస్.చంద్రశేఖర్ జ్ఞానజ్యోతి కోర్సు అమలుపై శిక్షణ ఇచ్చారు.

నేటి నుంచి సబ్-జోన్ బాలికల ఆటల పోటీలు

ముదినేపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : కైకలూరు నియోజకవర్గ స్థాయి హైస్కూల్ విద్యార్థుల సబ్ - జోన్ ఆటల పోటీలు శుక్రవారం నుంచి జరగనున్న నేపథ్యంలో ముదినేపల్లి జడ్పీ హైస్కూల్‌లో, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోను క్రీడా స్థలాలను సిద్ధం చేస్తున్నారు. బాలికలకు వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, ఖోఖో పోటీలను నిర్వహించనున్నారు. హెచ్ఎం విజయకుమార్, పోటీల కన్వీనర్, పీడీ కోడి రోజా, పీడీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. నియోజకవర్గంలోని 30 హైస్కూళ్లు, ఎయిడెడ్, యూపీ పాఠశాలలకు చెందిన 500 మంది బాలికలు ఈ పోటీల్లో పాల్గొంటారు.



ముదినేపల్లి జడ్పీ హైస్కూల్‌లో ఆటల పోటీలకు ఏర్పాట్లు

న్యాయ ఫలాలు అందరికి అందాలి

సీనియర్ సివిల్ జడ్జి వీవీఎన్‌వీ లక్ష్మీ

కైకలూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ప్రతీ వ్యక్తికి న్యాయపరంగా అందాల్సిన ఫలాలు అందినప్పుడే సామాజిక న్యాయం జరిగినట్లని కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వీవీఎన్‌వీ లక్ష్మీ అన్నారు. కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా న్యా యవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. న్యాయ మూర్తి మాట్లాడుతూ సామాజిక న్యాయం పట్ల విద్యార్థులు అవగాహనతో ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ వై.శ్రీలత, అధ్యాపకురాలు వై.జ్ఞాన ప్రసూనాంబ, న్యాయవాదులు పి.పవన్‌కాంత్, డి.శివప్రసాద్ పాల్గొన్నారు.



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి వీవీఎన్‌వీ లక్ష్మీ

జాతీయ స్థాయి జూనియర్ నెట్ వాలీబాల్ పోటీలకు కైకలూరు విద్యార్థిని ఎంపిక

కైకలూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి జూనియర్ నెట్ వాలీబాల్ పోటీలకు కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళా శాలలో బీకాం ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఇంటి లావణ్య ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత గురువారం అభినందిస్తూ సత్కరించారు. ఈ నెల 23 నుంచి 26 వరకు హర్యానలోని భివానీలో జరగనున్న 37వ జాతీయ జూనియర్ నెట్ వాలీబాల్ పోటీల్లో పాల్గొనే రాష్ట్రజట్టు తరపున లావణ్య పాల్గొను న్నట్టు తెలిపారు. ఇటీవల తూర్పుగోదావరిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో ఈ అవకాశం దక్కిందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉదయ ప్రకాశ్, పీడీ మన్నే శివనాగరాజు, స్పోర్ట్స్ ఇన్‌చార్జి డాక్టర్ ఎం.హరిప్రసాద్, కళాశాల అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.



లావణ్యను అభినందిస్తున్న కళాశాల అధ్యాపక బృందం

వంట నూనెలు సల..సల..



- భగ్గుమంటున్న ధరలు
- బెంబేలెత్తున్న పేద, మధ్య తరగతి ప్రజలు
- ఇప్పట్లో దిగిరావంటున్న వ్యాపారులు
- నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు

వంటనూనెల ధరలు వేడెక్కుతున్నాయి. ఒకపక్క ఎండల వేడి మరోపక్క నూనె ధరలు మంట పుట్టిస్తున్నాయి. దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతు న్నారు.ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశా న్నంటుతుంటే నూనె ధరల పెరుగుదల వినియోగదారుల్లో ఆందోళన కలిగి స్తున్నాయి. సుమారు సంవత్సరం క్రితం పెరిగిన ధరలు ఇప్పటికి దిగి రాలేదు. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పెంటపాడు /ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : నెలరోజుల వ్యవధిలో లీటర్ ఆయిల్ ధరలు రూ.10 నుంచి రూ. 15 వరకు పెరిగాయి. నెలరోజుల క్రితం 15 కేజీల సన్‌ఫ్లవర్ డబ్బా 2150 ఉంటే ఇప్పుడు రూ.2400కు ఎగబాకింది. దీంతో ఒక కేజీ 140 రూపాయల నుంచి 160కి చేరుకుంది. పామాయిల్ కూడా దాదాపు అదే స్థాయిలో ఒక రూ.50కి అటు ఇటుగా ఉంది. వేరుశనగ నెలరోజుల ముందు 2300 ఉంటే ఇప్పుడు 2500కి చేరుకుని కేజీ రూ.165పైకి ఎగబాకింది. వాస్తవానికి సంవత్సరం క్రితం ఉండే పామాయిల్ 900 గ్రాముల నూనె ప్యాకెట్ రూ.125 ఉండేది. ప్రస్తుతం అది రూ.133లకు ఎగబాగికింది. ఫ్రీడం 900 గ్రాముల ధర గతంలో రూ.120 ఉండేది. ప్రస్తుతం అది రూ.150 లకు చేరుకుంది. సంవత్సరం క్రితం ఫ్రీడం సన్‌ఫ్లవర్ హోల్‌సేల్ 15 లీటర్ల డబ్బా రూ.1600 నుంచి రూ 1700 ఉండేది. ఇప్పుడది రూ.2300 లకు చేరింది. పామాయిల్ డబ్బా గతంలో రూ.1350 ఉండగా ప్రస్తుత మార్కెట్‌లో రూ.1900 నుంచి రూ.2 వేల వరకూ ఎగబాకింది. గత వైసీపీ ప్రభుత్వంలో నూనె ధరలు ఆకాశాన్ని తాటాయి. సంవత్సర కాలం నుంచి ప్రజలు పెరిగిన నూనె ధరల కారణంగా ఇబ్బందులు పడుతూనే వస్తున్నారు. హోల్‌సేల్ మార్కెట్ నుంచి నూనె కొనుగోలు చేసినప్పటికీ లేబర్ ఖర్చు, రవాణా ఖర్చులను కలుపుకుని తాము రెండు మూడు రూపాయలు అదనంగా వేసుకుని అమ్మకాలు సాగిస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. అయితే గ్రామాల్లోకి వచ్చేసరికి ఈ ధరలు మరింత పెరిగిపోతున్నాయి. ప్రతీ లీటర్ నూనెపై రూ.10 అదనంగా వెచ్చించుకుని అమ్మకాలు సాగిస్తున్నారు .

వ్యాపారులు డీలా

టిఫెన్ సెంటర్లు, బజ్జీల బండ్లపై వ్యాపారాలు సాగించేవారికి ఈ ధరలు ఇబ్బందిగా మారాయి. దీంతో వ్యాపారాలు ఎలా సాగించాలో తెలియక తికమక పడిపోతున్నారు. టిఫెన్ సెంటర్‌లో నాలుగు బజ్జీలు రూ.20 లకు విక్రయాలు సాగించే వ్యాపారులు పెరిగిన నూనె ధరలతో చేసేది లేక బజ్జీల సైజ్ తగ్గించి వ్యాపారం సాగిస్తున్నారు. స్వీట్ షాపులది కూడా ఇదే పరిస్థితి. గతంతో షాపును బట్టి కేజీ రూ.150 నుంచి 200 వరకూ సాగించే వ్యాపారులు ప్రస్తుతం ఆ . ధరలను పెంచి రూ.200 నుంచి రూ.250 వరకూ విక్రయాలు సాగిస్తున్నారు. ప్రతీది నూనెతోనే అవసరం. ధరలు నియంత్రణ కాకపోతే తమకు జీవనోపాధి ఉండదని కొంత మంది వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూనె ధరలు ఇప్పటిలో తగ్గే పరిస్థితి లేదని పలువురు వ్యాపారులు చెబుతున్నారు.

కారణాలెన్నో..

ఉక్రెయిన్, రష్యాల నుంచి సన్‌ఫ్లవర్ ఆయిల్, ఇండోనేషియా, అర్జెంటీనా, మలేషియా, సింగపూర్ నుంచి పామాయిల్ దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నది. దిగుమతులు చేసుకున్న తరువాత డాలర్లలో డబ్బు చెల్లించాల్సి రావడంతో నూనె ధరలు పెరుగుతున్నాయి.ఆరునెలల క్రితం కేంద్రం సుంకం పెంచడం, ఇప్పుడు రూపాయి మారకం విలువ తగ్గిపోవడంతో మరలా వంటనూనె ధరలకు రెక్కలొచ్చాయి. అంతర్జాతీయంగా పరిణామాలు వేగంగా మార్పు చెందటమే వంటధరల మార్పుకు కారణం. దేశంలో వంటనూనెలు దాదాపు 60 శాతం పైగానే ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నది. దాని వల్ల కూడా ధరలు పెరుగుతున్నాయి.

● సామాన్యుడు బలైపోతున్నాడు



వంటనూనెల ధరల పెరుగు దల వల్ల సామాన్యులకే దెబ్బ. వ్యాపారస్థులకు లాభం, నష్టం ఉండదు. రైతులకు మద్దతు ధర పెంచటం వల్ల ఆయిల్ రేట్లు పెరుగుతున్నాయి. డాలర్ విలువ పెరగటం కూడా ఒక కారణం. కేంద్ర ప్రభుత్వం విధించిన సుంకాలను తగ్గించుకుంటే వినియోగదారుడికి మేలు జరుగుతుంది.

- నేరేళ్ళ రాజేంద్ర, హోల్‌సేల్ నూనెల వ్యాపారి

● ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి



వంటనూనె ధరలు పెర గడం వల్ల అన్ని రకాల ఆహారపదార్థాల ధరలు పెరు గుతాయి. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలతో పాటు అన్ని రకాల ధరలు పెరిగాయి. రెండోసారి నూనె ధరలు పెరగడం వలన సామాన్యులకు, మధ్యతరగతి ప్రజలకు చాలా ఇబ్బందికరంగా ఉంది. ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

- గొల్లపల్లి మురళీ, వినియోగదారుడు,ఏలూరు



చాట్రాయిలో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

అంగన్‌వాడీలకు మూడో రోజు జ్ఞానజ్యోతి శిక్షణ

చాట్రాయి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): చాట్రాయి జడ్పీ హైస్కూల్‌లో గురువారం అంగన్వాడీ టీచర్స్‌కు మూడో రోజు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం జరిగింది. అంగన్వాడీ పిల్లలకు బోధనా సామర్థ్యాన్ని పెంచటం, పిల్లల సమగ్రాభివృద్ధి, శారీరక, మేధా, భావోద్వేగ, భాషా, సౌందర్య, సామాజిక సాంస్కృతిక అభివృద్ధికి సంబంధించి విద్యాబోధనను బలోపేతం చేయడంపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంఈవో బ్రహ్మచారి, హెచ్ఎం కృష్ణయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాయత్రిదేవి రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

బట్టలు ఆరేస్తుండగా కరెంట్ వైరు తగిలి..

సెక్యూరిటీ గార్డు మృతి

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): అనంతసాగరం గ్రామంలో మెతుకుమిల్లి నవీన్(25) గురువారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. అతడు మల్లవల్లిలోని స్పిన్నింగ్ మిల్లులో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. గురువారం ఉదయం విధులు ముగించుకుని ఇంటింటికి వచ్చిన అతడు బట్టలు ఆరవేస్తుండగా తీగపై ఉన్న కరెంట్ వైరుకు పొరపాటున చెయ్యి తగలడంతో విద్యుదాఘాతానికి గురై అతడు కింద పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	95, 104, 115
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

చాట్రాయి, ఫిబ్రవరి 20, (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తతగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.జ్యోతి కోరారు. జాతీయ క్షయవ్యాధి నివారణ వారోత్సవాల సందర్భంగా స్థానిక పీహెచ్‌సీలో గురువారం క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరికైనా రెండు వారాలు మించి దగ్గు, సాయంకాల సమయంలో జ్వరం, క్రమేపీ బరువు పెరగడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉంటే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. కఫం ద్వారా టీబీ వ్యాధిని నిర్ధారణ చేసే ట్రూనాట్ ఎంటీబీ టెస్ట్ పీహెచ్‌సీ లాబొరేటరీలో ఉందన్నారు. ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా క్షయవాధి పోస్టర్‌ను ఆవిష్కరిం చారు. సీనియర్ టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ రామాంజనేయులు, సీహెచ్‌వో రమణ, ల్యాబ్ టెక్నీషయన్ గాయత్రి, నాయక్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



క్షయవ్యాధి పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి జ్యోతి, తదితరులు

అభివృద్ధితోనే సామాజిక న్యాయం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రతి వ్యక్తి అభివృద్ధి చెందిన రోజున సామాజిక న్యాయం అందినట్లే అని నూజివీడు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివపార్వతి అన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సాంఘీక సంక్షేమ బాలికల వసతి గృహం-1లో గురువారం అంతర్జాతీయ సామాజిక న్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వారి భవిష్యత్ లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఇష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. న్యాయవాదులు పద్మాంజలి, గోపీకృష్ణ, పారా లీటల్ వలంటీర్ విజయశాంతి, హాస్టల్ వార్డెన్ రామినేని సంధ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి శివపార్వతి

మార్చి 8న నూజివీడులో లోక్ అదాలత్

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండల న్యాయ సేవాధికార సంస్థ నూజివీడు వారి ఆధ్వర్యంలో మార్చి 8న నూజివీడులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు నూజివీడు న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగ శైలజ తెలిపారు. ఆమె మాట్లాడుతూ కేసులు పరిష్కారానికి సుముఖంగా ఉన్న కక్షిదారులు తమ న్యాయవాది ద్వారా ఇరు పార్టీలు హాజరై రాజీ కుదుర్చుకుని తద్వారా ఖర్చు, సమయం ఆదా చేసుకోవచ్చన్నారు. ఈ అదాలత్‌లో రాజీకి అవకాశం ఉన్న అన్ని క్రిమినల్ కేసులు, బ్యాంకు రికవరీ, ఎక్సైజ్, చెక్ బౌన్స్, మోటార్ యాక్సిడెంట్ మొదలైనవి పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

20 లీటర్ల సారా పట్టివేత

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): యనమదల గ్రామంలో సారా తరలిస్తున్న ఒకరిని అరెస్ట్ చేశామని జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరెండెంట్ అజయ్‌కుమార్ సింగ్ తెలిపారు. గురువారం గ్రామంలో నిర్వహించిన దాడిలో సిద్ధార్థనగర్‌కు చెందిన లావూరి వెంకట శ్రీనివాసరావును అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి 20 లీటర్ల సారా, బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. దాడిలో ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ భోగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు



అక్కిరెడ్డిగూడెంలో రీ సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజ్‌కుమార్

నిబంధనల ప్రకారం రీ సర్వే చేయాలి

ముసునూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల ప్రకారం రీ సర్వే చేయాలని తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ అన్నారు. పైలట్ ప్రాజెక్టుగా అక్కిరెడ్డిగూడెంలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు జరిగిన సర్వే సంబంధించిన రికార్డులను పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ సూచించారు. రైతులు రీ సర్వేకు సహకరించాలని కోరారు. రీసర్వే డీటీ పురుషోత్తమశర్మ పాల్గొన్నారు.